
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
కృష్ణా జిల్లా వార్తలు
గురువారం 24 ఏప్రిల్ 2025



ఆ నాలుగు సంస్థలకు కట్టబెట్టేందుకే..!

ఇసుక టెండర్ల వ్యవహారం కొత్త మలుపు తిరిగింది. కృష్ణాజిల్లాలోని పామర్రు, పెనమలూరు మండలాల పరిధిలోని చోడవరం, రొయ్యూరు, నార్త్ వల్లూరు, లంకపల్లి ఇసుక క్వారీలకు పిలిచిన టెండర్లను సిండికేట్ రింగ్ బాగోతం బయటపడటంతో ముఖ్యనేత ఆదేశాలతో కృష్ణాజిల్లా యంత్రాంగం రద్దు చేసింది. మళ్లీ టెండరు నోటిఫికేషన్‌ను వెలువరించింది. ముందుగానే ఫిక్స్ చేసుకున్న కాంట్రాక్టు సంస్థలకే టెండర్లు దక్కేలా నిబంధనలను సవరించింది. జిల్లా మైనింగ్ డీడీ వ్యవహారం తీవ్ర ఆరోపణలకు దారి తీస్తోంది.
- (ఆంధ్రజ్యోతి, విజయవాడ)

ఇసుక టెండర్లు రద్దు.. రీ నోటిఫికేషన్

ఏ జిల్లాలోనూ లేని నిబంధన అమలు



ఆ నాలుగు కాంట్రాక్టు సంస్థలతో డీల్!

ఇసుక క్వారీలను దక్కించుకునేందుకు వచ్చిన రాష్ట్రేతర నాలుగు కాంట్రాక్టు సంస్థలతో రూ. కోట్లలో డీల్‌ను కుదుర్చుకున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. వాటికి తప్ప మిగిలిన ఏ సంస్థకు కూడా టెండరు దక్కకుండా ఉండాలన్న ఉద్దేశ్యంతో కొత్తగా పిలిచిన టెండరు నోటిఫికేషన్‌లో మార్పులు చేశారు. ఆ నాలుగు కంపెనీల జీఎస్టీలను కృష్ణాజిల్లా మైనింగ్ అధికారులు వ్యక్తిగతంగా తెప్పించుకుని మరీ పరిశీలించినట్లు తెలిసింది. ఆ జీఎస్టీలన్నీ కూడా స్థానికంగా బ్రాంచ్‌లు కలిగినట్టుగా ఎప్పటి నుంచి ఉన్నాయో నిర్ధారించుకున్నట్లు సమాచారం. మార్చి 25వ తేదీ నాటికి అవి జీఎస్టీ లోకల్ బ్రాంచ్‌లుగా రిజిస్ట్రేషన్ అయినట్టుగా తీసుకుని ఉన్నాయి. టెండర్లు వేసిన మిగిలిన కంపెనీల స్థానిక జీఎస్టీ బ్రాంచ్‌లు ఎప్పుడు రిజిస్టర్ అయ్యాయో కూడా సరిచూసుకున్నారు. ముఖ్యనేత చెప్పినట్టుగా ఇసుక టెండర్లు నాలుగు కంపెనీలకు దక్కేలా జీఎస్టీ బ్రాంచ్ అడ్రస్‌ల రిజిస్ట్రేషన్ మార్చి 31వ తేదీ నాటికి జరిగి ఉండాలన్న సరికొత్త టెండరు నిబంధన విధించారు. అంటే కొత్తగా టెండర్లు వేయాల్సి వస్తే.. ఆ నాలుగు కంపెనీలు తప్పితే మరే కంపెనీ కూడా టెండరు వేయటానికి అర్హత సాధించదు.

- పోటీ తప్పించేందుకు పక్కా వ్యూహం
- ముఖ్యనేత ఆదేశాలు శిరసావహిస్తున్న యంత్రాంగం!
- అంతా తానై నడిపిస్తున్న మైనింగ్ డీడీ!
- అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు

23న టెండర్లు.. 26న తుది గడువు

కృష్ణాజిల్లా ఇసుక టెండర్ల రీ నోటిఫికేషన్‌ను బుధవారం విడుదల చేశారు. ఈ నెల 26వ తేదీతో ఈ ప్రొక్యూర్‌మెంట్ పోర్టల్‌లో బిడ్లను దాఖలు చేయటానికి తుది గడువుగా నిర్దేశించారు. ఎక్కడాలేని విధంగా మూడు రోజుల్లో బిడ్లను సమర్పించటం అనే నిబంధనను ఇక్కడ చేర్చారు.

పెద్ద కాంట్రాక్టు సంస్థను తప్పించేందుకే రద్దు నాటకం!

వాస్తవానికి ఈ టెండర్లను రద్దు చేసే వారు కాదు. అనుకోకుండా వివాదాస్పదం కావటంతో పాటు ఇసుక టెండర్లలో సిండికేట్ రింగ్ సంస్థలతో పాటు ఒక పెద్ద కాంట్రాక్టు సంస్థ కూడా టెండరు వేసింది. ఆ సంస్థను తప్పించేందుకు కూడా చాలా తెలివిగా వివాదాస్పదమయ్యాయన్న పేరుతో టెండర్లను రద్దు చేశారు. వాస్తవానికి ఆ సంస్థ మిగతా 6లో..

ఎక్కడా లేని నిబంధన ఇక్కడ!

ఇలాంటి నిబంధన రాష్ట్రంలో ఏ జిల్లాలో కూడా ఇంత వరకు అమలు చేయలేదు. స్థానిక జిల్లాలోనే జీఎస్టీ బ్రాంచ్‌లు కలిగి ఉండాలన్న నిబంధనను ఎక్కడా కూడా విధించలేదు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు చాలా జిల్లాల్లో ఇసుక టెండర్లు నిర్వహించారు. రాష్ట్రంలో జీఎస్టీ ఎక్కడ కలిగి ఉన్నా టెండర్లలో పాల్గొనే అవకాశం కల్పించారు. దీని వల్ల ప్రభుత్వానికి కూడా ఆదాయం వచ్చింది. గుంటూరు జిల్లాలో నిర్వహించిన ఇసుక టెండర్లు అయితే టెక్నికల్ బిడ్ పాస్ అయిన వాటికి లాటరీ తీసి ఇసుక రేవులను కేటాయించారు. దీంతో ఎక్కడా ఆరోపణలు రాలేదు. ఒక్క కృష్ణాజిల్లాలో మాత్రమే జిల్లాలో జీఎస్టీ రిజిస్ట్రేషన్ కలిగి ఉండాలన్న నిబంధన విధించారు. ఈ నిబంధన వల్ల టెండర్లలో పాలు పంచుకోవటానికి ఎవరూ రారు. పెద్దగా పోటీ పడరు. వచ్చిన వాళ్లను ఏదో ఒక కారణంతో తప్పించాలన్న వ్యూహం ఎలాగూ సిద్ధం చేసుకున్నారు. కాబట్టి అస్మదీయ నాలుగు కాంట్రాక్టు సంస్థలకు చోడవరం, రొయ్యూరు, నార్త్ వల్లూరు, లంకపల్లి ఇసుక క్వారీలు దక్కేలా ముఖ్యనేత ఆదేశాలతో జిల్లా మైనింగ్ శాఖ అధికారులు మాస్టర్ ప్లాన్ రూపొందించారని తెలిసింది. లోకల్‌గా ఉన్న సంస్థలు టెండర్లు వేసినా వాటికి పెద్దగా టర్నోవర్ లేకపోవటంతో అవి ఎలాగూ దక్కించుకోలేవు. ఎందుకంటే రేటు ఒకటే వేస్తే ఆ కంపెనీల వార్షిక టర్నోవర్ దేనికి ఎక్కువ ఉంటే దానికి అప్పగిస్తారు. స్థానిక కంపెనీలకు అంత పెద్ద వార్షిక టర్నోవర్ ఉండదు కాబట్టి ఈ మేరకు పథక రచన చేశారు.



పదిలం

టెన్త్ ఫలితాల్లో సత్తాచాటిన ఉమ్మడి కృష్ణా

ఉత్తీర్ణతలో పెరిగిన ఎన్టీఆర్ జిల్లా స్థానం

- ఒక్కసారిగా ఆరు స్థానాలు అధిగమించి.. రాష్ట్రంలో ఎనిమిదో స్థానం
- పదో స్థానంలో నిలిచిన కృష్ణాజిల్లా

గతేడాదితో పోలిస్తే మెరుగైన ఫలితాలు సాధించిన విద్యార్థులు

పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఉమ్మడి కృష్ణాజిల్లా విద్యార్థులు ప్రతిభ చూపారు. 86.68 శాతం ఉత్తీర్ణతతో ఎన్టీఆర్‌జిల్లా ఒక్కసారిగా 13వ స్థానం నుంచి ఎనిమిదో స్థానానికి వెళ్లింది. 85.32 ఉత్తీర్ణత శాతంతో కృష్ణాజిల్లా 11వ స్థానం నుంచి పదో స్థానానికి చేరింది. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది మెరుగైన ఫలితాలు సాధించింది.

(ఆంధ్రజ్యోతి - విజయవాడ) పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఉమ్మడి కృష్ణాజిల్లా ఉత్తమ ప్రతిభను కనబరిచింది. ఎన్టీఆర్ జిల్లా ఈ ఏడాది ఒక్కసారిగా ఆరు స్థానాలుపైకి ఎగబాకింది. బుధవారం విడుదలైన పరీక్షా ఫలితాల్లో జిల్లా 86.68శాతం ఉత్తీర్ణతను సాధించింది. రాష్ట్రంలో ఎనిమిదో స్థానంలో నిలిచింది. గడచిన విద్యాసంవత్సరం 86.76 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో 13వ స్థానంలో ఉంది. ఈ ఏడాది ఫలితాల్లో ఆరు మెట్లు ఎక్కింది. జిల్లాలో మొత్తం 13,938 మంది బాలురు పరీక్షలు రాయగా 11,662 మంది పాసయ్యారు. బాలికలు 13,529 మంది పరీక్షలకు హాజరవ్వగా 11,872 మంది ఉత్తీర్ణతను సాధించారు. పదో తరగతి ఫలితాల్లో కృష్ణా జిల్లా నుంచి 20,776 మంది విద్యార్థులు హాజరవ్వగా 17,726 మంది ఉత్తీర్ణులయ్యారు. బాలురు 8,998 మంది, మిగతా 6లో..

19 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు

పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలను మే 19వ తేదీ నుంచి 28వ తేదీ వరకు నిర్వహించనున్నారు. పరీక్షరాసే వారు గురువారం నుంచి 30వ తేదీలోగా పరీక్ష ఫీజును చెల్లించాల్సి ఉంది. జవాబు పత్రాల రీవెరిఫికేషన్, రీకౌంటింగ్ కోసం గురువారం నుంచి మే 1వ తేదీలోగా ఫీజును చెల్లించాల్సి ఉంది. రీకౌంటింగ్‌కు ఒక్కోసబ్జెక్టుకు రూ.500, రీ వెరిఫికేషన్‌కు ఒక్కో సబ్జెక్టుకు రూ.1000 చెల్లించాల్సి ఉంది.



న్యాయవాద వృత్తి ఎంతో పవిత్రమైంది
- జిల్లా న్యాయాధికారి గోపీ 8

కృష్ణా డీపీవో, జడ్పీ సీఈవోకు అవార్డులు 8



మచిలీపట్నం అభివృద్ధికి బృహత్తర ప్రణాళిక
- మంత్రి కొల్లు రవీంద్ర 8

సమస్యలతో సహవాసం

అస్తవ్యస్తంగా ధాన్యం కొనుగోళ్లు

- పూడికతీతకు నోచుకోని పంట కాలువలు
- మౌలిక సదుపాయాలు లేక జగనన్న కాలనీల్లో పేదల అవస్థలు
- అభివృద్ధికి నోచుకోని రహదారులు
- విద్యుత్ సబ్సిడీ అందక ఆక్వా రైతుల పాట్లు
- నేటి జిల్లా సమీక్షా సమావేశంలో జిల్లా సమస్యలపై చర్చించేనా!

జిల్లాలోని ప్రజలు సమస్యలతో సహవాసం చేస్తున్నారు. పండించిన ధాన్యం అమ్ముకోలేక రైతులు అవస్థలు పడుతున్నారు. పూడిక తీతకు నోచుకోని కాలువలు, డ్రెయిన్లు పంటలను ముంచేస్తున్నాయి. కనీస మౌలిక సదుపాయాలు కరువై జగనన్న కాలనీల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ సబ్సిడీ అందక ఆక్వా రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. అభివృద్ధికి నోచుకోని రహదారులు, తాగు, సాగు నీటి సమస్యలు జిల్లా వాసులను వేధిస్తున్నాయి.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం: జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్ అధ్యక్షతన జెడ్పీ సమావేశపు హాలులో జిల్లా సమీక్షా సమావేశం గురువారం జరగనుంది. మంత్రి కొల్లు రవీంద్ర, శాసన సభ్యులు, ఎంపీ, జిల్లా అధికారులు హాజరుకానున్నారు. ప్రభుత్వ ఏర్పడిన తర్వాత తొలి జిలా సమీక్షా సమావేశం కావడంతో ఈ సమావేశంలో జిల్లా అభివృద్ధికి సంబంధించి ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారనే అంశంపై చర్చ జరుగుతోంది. గతంలో మిగతా 6లో..



లారీలోకి ఎత్తుతున్న ధాన్యం

పశువైద్యశాలల్లో మందుల కొరత

జిల్లాలో 29,261 ఆవులు, 3.50 లక్షల గేదెలు, 1.71 లక్షల గొర్రెలు, 40,500 మేకలు ఉన్నాయి. వ్యవసాయానికి అనుబంధంగా పాడిపరిశ్రమ ఉంటోంది. జిల్లాలో ఏరియా వెటర్నరీ ఆస్పత్రులు 13, వెటర్నరీ ఆస్పత్రులు 59, గ్రామీణ పశువైద్యశాలలు 101 ఉన్నాయి. వీటిలో పశువులకు సంబంధించిన మందులు అందుబాటులో ఉండటం లేదు. పశువులు అనారోగ్యం పాలైనసమయంలో ఆస్పత్రులకు వాటిని తీసుకువెళితే అవసరమైన మందులు బయటనే కొనుగోలు చేయాల్సిన దుస్థితి. ఈ అంశంపై ఈ సమావేశంలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో చూడాలి.

కార్పొరేట్ కళాశాలల నిర్వాకంతో వేసవి సెలవుల్లోనూ విద్యార్థులకు చదువుల బాధలు తప్పడంలేదు. జేఈఈ, ఎంసెట్ ర్యాంకుల పేరుతో సంవత్సరం పొడవునా పుస్తకాలతో కుస్తీ పట్టిస్తున్నారు. ప్రత్యేక కోర్సుల పేరిట తల్లిదండ్రుల జేబులను ఖాళీ చేస్తున్నారు. ఎవరైనా వేసవి సెలవులు కదా అంటే మీకు ర్యాంకులు రావాలా.. వద్దా అంటూ కరకుగా సమాధానం చెబుతున్నారు. బస్సులు నడపం.. మీరే ఎక్కించుకురావాలి అంటూ హుకుం జారీ చేస్తున్నారు. దీనిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

సెలవుల్లోనూ.. చదువుల బాధలు!



కార్పొరేట్ కళాశాలల నిర్వాకం

- వేసవి సెలవుల్లోనూ విద్యార్థులు రావాల్సిందేనని హుకుం
- జేఈఈ, ఎంసెట్ ర్యాంకుల పేరిట చితికిపోతున్న బాల్యం
- సంవత్సరం పొడవునా పుస్తకాలతో కుస్తీ!
- ప్రత్యేక కోర్సుల పేరిట అధిక ఫీజులు
- రవాణా విషయంలో మాత్రం శ్రద్ధ వహించని కాలేజీలు
- చిన్న వయస్సులోనే డిప్రెషన్, ఆరోగ్య సమస్యలు

విజయవాడ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణాజిల్లాలో సుమారు 170 వరకు కార్పొరేట్ విద్యాసంస్థలు ఉన్నాయి. వాటిలో ప్రధానంగా మొగల్రాజపురంలోని 47 కళాశాలలు, బెంజ్‌సర్కిల్‌లోని 20 కళాశాలలు, రామవరప్పాడు ఏరియాలోని మరో 13 కళాశాలల్లో వేసవి తరగతులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఇంటర్మీడియట్ విద్యార్థులపై ప్రైవేటు కాలేజీ యాజమాన్యాలు రోజురోజుకు చదువు ఒత్తిడి పెంచుతున్నాయి. ప్రథమ సంవత్సరం పరీక్షలు పూర్తయి మూడు వారాలు కూడా గడవకముందే ద్వితీయ సంవత్సరం మార్కుల టార్గెట్ అంటూ తరగతులు నిర్వహిస్తున్నాయి. విద్యార్థులకు కొన్నేళ్ల కిందట వరకు ప్రత్యేక తరగతులు పెట్టేవారు. ప్రస్తుతం కాలానికనుగుణంగా ప్రథమ సంవత్సరం పూర్తి కాగానే ద్వితీయ సంవత్సర తరగతులతో పాటు, జేఈఈ, ఎంసెట్ తరగతులను నిర్వహిస్తున్నారు. ఇప్పటికే నగర పరిధిలోని అనేక ప్రైవేటు కాలేజీలు ఇంటర్ మొదటి ఏడాది ఉత్తీర్ణత అయిన విద్యార్థులకు రెండవ ఏడాదికి ప్రత్యేక తరగతులను ప్రారంభించాయి. ఇందుకు సంబంధించి ఆయా కాలేజీలు విద్యార్థుల నుంచి భారీగా ఫీజులు వసూలు చేస్తున్నాయి. ఎక్కువ మార్కుల సాధించిన విద్యార్థులపై ప్రత్యేకంగా మిగతా 6లో..

బౌద్ధ స్థూపాలకు పూర్వ వైభవం

జిల్లాలో పర్యాటకం పరుగులు.. కొండపల్లికి కొత్త పుంతలు : ఏపీటీడీసీ


జగ్గయ్యపేటలోని ధనంబోడులో బౌద్ధస్థూపం

విజయవాడ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లాను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు పర్యాటకశాఖ కసరత్తు ప్రారంభించింది. ప్రధానంగా బౌద్ధ ఆనవాళ్లున్న ధనంబోడు, రామిరెడ్డిపల్లి(గుమ్మడిరుద్ర) ప్రాంతాలను అభివృద్ధి చేసి పర్యాటకులను ఆకర్షించాలని టూరిజం, ఏపీటీడీసీ శాఖ భావిస్తోంది. దీనిలో భాగంగా సంబంధిత ప్రదేశాలను పరిశీలించి నివేదికలను ప్రభుత్వానికి సమర్పించింది. ఇక్కడి స్థూపంలో బుద్ధుని దంతం ఉంటుందని స్థానిక ప్రజలు చెబుతున్నారు. ఈ ప్రాంతం జగ్గయ్యపేట రైల్వేస్టేషన్‌కు సమీపంలో ఉన్న ధనంబోడు కొండపై ఉంది. కొండపైకి కాలినడకన వెళ్లాల్సిందే. గతంలో నిధి నిక్షేపాలున్నాయన్న అపోహతో గుర్తుతెలియని వ్యక్తులు ఇక్కడ తవ్వకాలు జరిపి ప్రధాన స్థూపం చుట్టూ ఉన్న కట్టడాలను ధ్వంసం చేశారు. ఇప్పటికీ వాటి అవశేషాలు అక్కడ దర్శనమిస్తాయి. రాష్ట్ర విభజన అనంతరం నాటి ప్రభుత్వం ధనంబోడును పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని ప్రతిపాదించింది. అయితే ఇప్పటికీ అక్కడ ఎటువంటి అభివృద్ధి జరగలేదు. మళ్లీ టీడీపీ అధికారంలోకి రావడం.. పర్యాటక అభివృద్ధిలో భాగంగా దీనిపై దృష్టిసారించింది. చింతపల్లి తరువాత అమరావతి రాజధానిగా 1761 నుంచి 1816 వరకు పరిపాలించిన వాసిరెడ్డి వెంకటాద్రినాయుడనే జమిందారు తన తండ్రి జగ్గన్న పేరు మీద జగ్గయ్యపేటను నిర్మించాడు. అంతకు పూర్వం జగ్గయ్యపేటను బేతవోలుగా పిలిచేవారని అక్కడి ప్రజలు చెప్పుకుంటారు. ప్రస్తుతం బౌద్ధ స్థూపమున్న కొండను పూర్వం వెలిగిరిగా పిలిచివారని చరిత్ర చెబుతోంది. జగ్గయ్యపేటకు తూర్పున 2 కిలోమీటర్ల దూరంలో పర్వతంపై ఈ బౌద్ధక్షేత్ర నిర్మాణం జరిగింది. స్థానికులు ఈ పర్వతాన్ని ధనంబోడు, ధనందిబ్బ, ధనవుకొండ అని పిలుస్తారు. 31.5 అడుగుల చుట్టుకొలత 5 అడుగుల ఎత్తు ఉన్న ఈ మహాస్థూపాన్ని పాలరాతితో నిర్మించారు.

ఆకర్షణీయంగా కొండపల్లి

కొండపల్లి చేనేత కొయ్యబొమ్మలకు ప్రసిద్ధి. దీనిని పర్యాటక ప్రాంతంగా మార్చడంతో పాటు కొండపల్లి బొమ్మలకు పూర్వ వైభవం తీసుకువచ్చే విధంగా ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. దీనిలో భాగంగా కొండపల్లిని హస్తకళకు కేంద్రంగా ఏర్పాటు చేయాలని ప్రభుత్వం పర్యాటక శాఖకు ప్రతిపాదనలు చేసింది. కొండపల్లి గ్రామంలో హస్తకళ అనుభవ కేంద్రాన్ని స్థాపించేందుకు పర్యాటక శాఖ ప్రణాళిక రూపొందించింది. రాష్ట్ర పర్యాటక శాఖ 'కొండపల్లి హెరిటేజ్ ఆర్టిసన్ స్ట్రీట్' పేరుతో అభివృద్ధి చేస్తోంది. ఇందులో హస్తకళ ప్రదర్శనలు, వర్క్‌షాపులు, ఆధునిక సాంకేతికతతో కూడిన ఇంటరాక్టివ్ అనుభవాలు అందుబాటులో ఉంటాయి. దీని ద్వారా మొబైల్ యాప్ సహాయంతో సందర్శకులకు సమాచారం తెలుసుకోవచ్చని పర్యాటక అధికారులు చెబుతున్నారు. పర్యాటకులకు అర్థమయ్యేవిధంగా, సౌకర్యంగా ఉండేందుకు లైవ్ డెమోలు, కొండపల్లి విక్రయ కేంద్రాలు వంటివి ఏర్పాటుచేస్తామని వెల్లడించారు.


గుప్త నిధుల కోసం తవ్వకాలు జరపడంతో పడి ఉన్న స్థూపాలు


ప్రదర్శనలో పుస్తకాలు చూస్తున్న విద్యార్థులు, పాఠకులు

పుస్తక పఠనంతో విజ్ఞానం

» జిల్లా ఉపగ్రంథాలయాధికారి నగేష్

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : పుస్తకపఠనం వల్ల విజ్ఞానాన్ని పొందవచ్చని కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ డిప్యూటీ లైబ్రేరియన్ నగేష్ అన్నారు. ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా భారతీయ సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శనకు అధిక సంఖ్యలో విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో నగేష్ మాట్లాడుతూ, గ్రంథాలయాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈనెల 28 నుంచి ఉదయం 8 నుంచి 12 గంటల వరకు విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. భారతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు కారుమూరి రాజేంద్రప్రసాద్, లాల్‌బహదూర్ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.


లైబ్రరీలో క్యారమ్స్, చెస్ ఆడుతున్న చిన్నారులు

టాయ్ లైబ్రరీతో చిన్నారుల్లో మేధాశక్తి పెంపు

» సర్వోత్తమ గ్రంథాలయంలో ప్రారంభం

బెంజిసర్కిల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : చిన్నారుల్లో మేధాశక్తి పెంపొందేందుకు టాయ్ లైబ్రరీ ఎంతగానో దోహదపడుతుందని ప్రముఖ పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ అనుమోలు శ్రీముఖి అన్నారు. బెంజిసర్కిల్‌లోని సర్వోత్తమ గ్రంథాలయంలో బుధవారం సాయంత్రం టాయ్ లైబ్రరీని ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావి శారద అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో డాక్టర్ శ్రీముఖి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. బొమ్మలతో పిల్లలు ఆడుకుంటే వారికి తెలియకుండానే పఠనాసక్తి అలవడుతుందని తెలిపారు. వేసవి సెలవులను టాయ్ లైబ్రరీ ద్వారా సక్రమంగా వినియోగించుకునే విధంగా తల్లిదండ్రులు కృషిచేయాలన్నారు. జూన్ 10 వరకు ప్రతిరోజు సాయంత్రం 4నుంచి 6గంల వరకు ఈ లైబ్రరీ అందుబాటులో ఉంటుందని రావి శారద తెలిపారు. ఈసందర్భంగా బుక్‌హంట్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.


టాయ్ లైబ్రరీని ప్రారంభిస్తున్న డాక్టర్ శ్రీముఖి

నేటి నుంచి మెడికల్ సర్టిఫికెట్ల పరిశీలన

మచిలీపట్నం టౌన్ : టీచర్ల బదిలీల నిమిత్తం ఉమ్మడి కృష్ణాజిల్లాల పరిధిలో పనిచేస్తున్న టీచర్లు తమ మెడికల్ సర్టిఫికెట్లను జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో 24, 25, 26 తేదీల్లో సమర్పించాలని డీఈవో పీవీజే రామారావు తెలిపారు. 24న ఉమ్మడి కృష్ణాజిల్లా పరిధిలో ఉండి ప్రస్తుత ఎన్టీఆర్ జిల్లాలో కొనసాగుతున్న 20 మండలాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మెడికల్ సర్టిఫికెట్లను సమర్పించాలన్నారు. 25న కృష్ణాజిల్లా పరిధిలోని 25 మండలాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, 26న ఉమ్మడి కృష్ణాజిల్లా పరిధిలో ఉండి ప్రస్తుతం ఏలూరు జిల్లాలో కొనసాగుతున్న ఎనిమిది మండలాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తమ మెడికల్ సర్టిఫికెట్లను సమర్పించాలని డీఈవో తెలిపారు. ఉపాధ్యాయుల బదిలీ నియంత్రణ చట్టం 2005 ప్రకారం ప్రిఫరెన్షియల్ కేటగిరి, స్పెషల్ పాయింట్లు పొందేందుకు మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ సర్టిఫికెట్లను పరిశీలిస్తారన్నారు. డీఈవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో అనారోగ్యంగా ఉండే ఉపాధ్యాయులు తమ సర్టిఫికెట్లను సమర్పించాలన్నారు.

సిపెట్ డిప్లొమా కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

బెంజిసర్కిల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): విజయవాడలోని సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోకెమికల్స్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ(సిపెట్)లో పదో తరగతి విద్యార్హతతో మూడేళ్ల వ్యవధిగల డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ టెక్నాలజీ(డీపీటీ), డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ మౌల్డ్ టెక్నాలజీ(డీపీఎంటీ) కోర్సుల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సిపెట్ డైరెక్టర్ అండ్ హెడ్ సీహెచ్ శేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా బీఎస్సీ విద్యార్హతతో రెండేళ్ల వ్యవధిగల పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ ప్రాసెస్సింగ్ అండ్ టెస్టింగ్(పీజీడీ-పీపీటీ) కోర్సుకు ఆన్‌లైన్ విధానంలో https://cipet25.onlineregistration.org/CIPET లింక్ ద్వారా మే 29లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ కోర్సులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ సదుపాయం ఉందని, సిపెట్ అడ్మిషన్ టెస్ట్(క్యాట్)ను జూన్8న నిర్వహించి వచ్చిన ర్యాంక్ ఆధారంగా విజయవాడ కేంద్రంలో 150 సీట్లు భర్తీచేస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కోర్సులు పూర్తిచేసిన వారికి ప్లాస్టిక్ రంగంలో గల బహుళజాతి సంస్థ(ఎంఎన్‌సీ), దాని అనుబంధ సంస్థల్లో జూనియర్ ఇంజనీర్(ప్రొడక్షన్), మౌల్డ్ డిజైనర్ అండ్ మేకర్ జూనియర్ ఇంజనీర్ (మెంటినెన్స్), క్వాలిటీ కంట్రోల్ విభాగాల్లో ఇన్‌స్పెక్టర్ ఉద్యోగాలు వస్తాయని ఆయన వివరించారు. ప్రారంభ వేతనం రూ. 20వేల నుంచి 25వేలు ఉంటుందని, అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 9398050255 నెంబరులో సంప్రదించాలని సీహెచ్ శేఖర్ కోరారు.

పది ఫలితాల్లో విశ్వభారతి రికార్డులు


ప్రేమ్‌కుమార్


కె.వర్షిత

గుడివాడ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్షా ఫలితాల్లో విశ్వభారతి ఇంగ్లీషు మీడియం విద్యార్థి కోరుకొండ ప్రేమ్‌కుమార్ 597, కె.వర్షిత 596 మార్కులతో డివిజన్‌స్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారని పాఠశాల చైర్మన్ పొట్లూరి శ్రీమన్నారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 917మంది పరీక్ష రాయగా, అందరూ ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులై రికార్డు సాధించారన్నారు. 20మందికి 590కిపైగా, 162మంది 580పైగా, 376మంది 570పైగా, 546మంది 560కిపైగా మార్కులు సాధించారన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులను చైర్మన్ అభినందించారు.

టెన్త్‌లో ప్రైవేటుకు దీటుగా సత్తా చాటారు

బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యూకేషన్ ఆంధ్రప్రదేశ్ బుధవారం విడుదల చేసిన పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు దుమ్ము లేపారు. పలువురు విద్యార్థులు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా రాణించి ఉత్తమ ఫలితాలు సాధించారు.

సత్తా చాటిన కవలలు..

కంచికచర్ల రూరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : టెన్త్ ఫలితాల్లో కంచికచర్ల జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు నందికట్ల కుందన వెంకట నాగశ్రీసాయి, కందికట్ల కుందన వెంకట నాగశ్రీలు కవలు, అన్నా చెల్లెళ్లు. కుందన్ వెంకటనాగశ్రీసాయి 587, కుందన్ వెంకట నాగశ్రీ 584 మార్కులతో మండల ప్రథమ ద్వితీయ స్థానాలు సాధించారు. తండ్రి ప్లాస్టిక్ సామగ్రి విక్రయిస్తుంటాడు. తల్లి అంగన్వాడీ టీచర్.

ఉంగుటూరు మండలంలో ఇందుపల్లి జడ్పీహైస్కూల్‌కి చెందిన కవలలు దుబ్బాకుల దుర్గాయశ్వంత్ 591, దుబ్బాకుల వీరవెంకటనాగేంద్ర 589లతో మండలంలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు.


వెంకట నాగశ్రీ సాయి


వెంకట నాగశ్రీ


దుర్గాయశ్వంత్


వీరవెంకటనాగేంద్ర

- గొల్లపూడి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని అహ్మది సుల్తాన 590తో పాఠశాల ప్రథమ స్థానంలో నిలిచింది.
- మైలవరం జిల్లాపరిషత్ బాలికల హైస్కూల్ విద్యార్థిని పి.నందిని 593 మార్కులు సాధించి మండలస్థాయిలో ప్రథమస్థానం సాధించింది.
- విజయవాడరూరల్ నున్న గ్రామ జడ్పీహైస్కూల్ విద్యార్థి పల్లపోతుల రాజేష్ 591 మార్కులు సాధించి పాఠశాల టాపర్‌గా నిలిచాడు.
- సత్యనారాయణపురం ఏకేటీపీఎం పాఠశాల విద్యార్థి కె.ప్రణీత్ 592 మార్కులు సాధించాడు.
- గవర్నర్‌పేట కస్తూరిబాయిపేట జవహర్ నవోదయ విద్యార్థిని కొల్లా స్వాతి 598 మార్కులు సాధించింది.


అహ్మది సుల్తాన


పి.నందిని


కె.ప్రణీత్


రాజేష్

95 శాతం వసతి గృహ విద్యార్థుల ఉత్తీర్ణత


కె.లిఖిత

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి ఫలితాల్లో కృష్ణా జిల్లా పరిధిలోని సాంఘిక సంక్షేమశాఖ నిర్వహిస్తున్న 21 హాస్టళ్లలో 134 మంది విద్యార్థులు హాజరు కాగా 127 మంది ఉత్తీర్ణులయ్యారు. 16 హాస్టళ్లలోని విద్యార్థులు నూరుశాతం ఫలితాలు సాధించారని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి షేక్ షాహిద్‌బాబు తెలిపారు. 14మంది 500కు పైబడి మార్కులు సాధించారు. కోడూరు బాలికల హాస్టల్‌లో బొమ్మిడి తేజ 572, కొక్కిలిగడ్డ భావన 570, డోకిపర్రు బాలికల హాస్టల్ విద్యార్థిని ఎస్ బేగం 566, మచిలీపట్నం వలందపాలెంలోని బాలికల హాస్టల్ విద్యార్థిని కె.లిఖిత 588 మార్కులు సాధించినట్టు తెలిపారు.

సెలవుల్లోనూ.. చదువుల బాధలు!

(5వ పేజీ తరువాయి)

దృష్టి సారించి వారిని తరగతులకు వచ్చేలా యాజమాన్యాలు పథకాలు రచిస్తున్నాయి. ఇందుకోసం విద్యార్థుల తల్లిదండ్రులను సంప్రదించి ఫీజుల రాయితీ, ఎవరికో వచ్చిన ర్యాంకులను కాలేజీ ఖాతాలో చూపి మభ్యపెడుతున్నాయి. అనేక మంది విద్యార్థులకు మానసిక ఒత్తిడితో ఇబ్బందులు తప్పడం లేదు. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లినా వారు పట్టించుకోకపోవడంతో ప్రైవేటు కాలేజీ యాజమాన్యాలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయి. తల్లిదండ్రులు కూడా సహకారాన్ని అందిస్తుండటంతో విద్యార్థులది ఏమీ చేయలేని నిస్సహాయ స్థితి.

వేసవి టూర్లు, సరదాలు మాయం

వేసవి సెలవులు వచ్చాయి అనగానే విద్యార్థులు అమ్మమ్మ వాళ్ల ఇంటికో, కుటుంబంతో వేసవి విడిదికో వెళ్తారనే ఆలోచన సెలవులకు ముందే వారి మనసులో నాటుకుపోయేది. కానీ ఇది ఒకప్పటి మాట. వేసవి సెలవులు అనేవి చరిత్రగా చెప్పుకునే పరిస్థితికి నేటి తరం విద్యార్థులు వచ్చారంటే అతిశయోక్తి కాదు. కొన్ని కార్పొరేట్ కళాశాలలు ప్రభుత్వ నిబంధనలను పట్టించుకోకుండా ఫలితాలు వెలువడిన కొన్ని రోజులకే కోచింగ్ పేరుతో క్లాసులు పెట్టి విద్యార్థులను మానసికంగా తీవ్ర ఒత్తిడికి గురిచేస్తున్నాయి. విద్యార్థులు మానసిక ఉత్సాహంగా ఉంటేనే వారిలో సృజనాత్మకత పెరుగుతుంది. కానీ దీనికి భిన్నంగా నేటి విద్యావ్యవస్థ తయారైంది. దీనికి విద్యార్థుల తల్లిదండ్రులు కూడా వత్తాసు పలకడంతో కార్పొరేట్ విద్యా సంస్థల ఆగడాలకు హద్దు లేకుండా పోతోంది. ఉమ్మడి కృష్ణాజిల్లా విద్యాశాఖ అధికారులు తక్షణం స్పందించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

తల్లిదండ్రుల ఆలోచన దృక్పథం మారాలి

భాష, వేషధారణ, విహార వినోదాల పేరుతో పాశ్చాత్య పోకడలను అనుసరిస్తున్న నేటి తరం తల్లిదండ్రులు పిల్లలకు చదువు, కెరీర్‌కు సంబంధించిన విషయంలో ఎలాంటి స్వేచ్ఛనిస్తున్నారో ఆలోచించడం లేదు. పాశ్చాత్య దేశాలలో పిల్లలకు కనీస వయస్సు వస్తే వారి సొంత ఆలోచనలకు విలువనిస్తారు. కానీ మన దేశంలో ముప్పై ఏళ్లు వచ్చినా తల్లిదండ్రులు చెప్పినట్టే నడుచుకోవాలి. తల్లిదండ్రులు పిల్లల విషయంలో ఇతరులతో పోలికలు మానుకుని వారికి నచ్చిన రంగంలో ప్రోత్సహిస్తే అనుకున్న విజయాలు సాధించడానికి దోహదపడేవారవుతారని నిపుణులు పేర్కొంటున్నారు. ఈ విషయంపై నేటి తరం తల్లిదండ్రులు కచ్చితంగా ఆలోచించాల్సి అవసరం ఎంతైనా ఉంది.

పదిలం

(5వ పేజీ తరువాయి)

బాలికలు 8,728 మంది ఉత్తీర్ణతను సాధించారు. జిల్లాలో 85.32 ఉత్తీర్ణత శాతం నమోదైంది. 2023-24వ సంవత్సరంలో 90.05 శాతం ఉత్తీర్ణతతో 11వ స్థానంలో ఉన్న కృష్ణా ఈ సారి పదో స్థానం నిలిచింది.

మేనేజ్‌మెంట్ల వారీగా..

బీసీ సంక్షేమ పాఠశాలలు అత్యధికంగా ఉత్తీర్ణతను సాధించాయి. ఈ పాఠశాలల్లో విద్యార్థులు 97.27 శాతంతో ఉత్తీర్ణతను సాధించారు. బీసీ సంక్షేమ పాఠశాలల్లో 110 మంది విద్యార్థులకు గాను 107 మంది ఉత్తీర్ణులయ్యారు. కస్తూర్బాగాంధీ పాఠశాలలు 96.43శాతం ఉత్తీర్ణతతో ద్వితీయస్థానంలో నిలిచాయి. కేజీబీవీ పాఠశాల్లో 112 మంది విద్యార్థులకుగాను 108 మంది ఉత్తీర్ణులై 93.82శాతం ఉత్తీర్ణతను సాధించారు. సోషల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ పాఠశాలల్లో మొత్తం 566 మంది పరీక్షలు రాశారు. వారిలో 144 మంది బాలురు, 422 మంది బాలికలు ఉండగా 127 మంది బాలికలు, 404 మంది బాలురు ఉత్తీర్ణులయ్యారు. 93.82 శాతం ఉత్తీర్ణతో ఈ పాఠశాలలు మూడో స్థానంలో నిలిచాయి. ప్రైవేట్ పాఠశాలలు 92.75శాతం ఉత్తీర్ణతను సాధించాయి. మొత్తం 14,787 విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల నుంచి పరీక్షలకు హాజరయ్యారు. 8,644 బాలురకు గాను 7,916 మంది ఉత్తీర్ణులయ్యారు. బాలికలు 7,299 మందికి గాను 6871 మంది ఉత్తీర్ణులయ్యారు. ఏపీ మోడల్ స్కూళ్ల నుంచి 59 మంది బాలురు, 79 మంది బాలికలు పరీక్షలకు హాజరయ్యారు. వారిలో 54 మంది బాలురు, 72 మంది బాలికలు ఉత్తీర్ణులై 91.30 శాతం సాధించారు. ప్రైవేటు ఎయిడెడ్ పాఠశాలల నుంచి 324 మంది బాలురు, 513 మంది బాలికలు పరీక్షలు రాస్తే అందులో 267 మంది బాలురు, 428 మంది బాలికలు ఉత్తీర్ణత సాధించారు. ఈ విద్యాసంస్థల్లో 83.03 శాతం నమోదైంది. గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలు 82.55 శాతం ఉత్తీర్ణతను సాధించాయి. గిరిజన గురుకులాల్లో 48 మంది బాలురు, 187 మంది బాలికలతో కలుపుకుని మొత్తం 235 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. వారిలో ఏడుగురు బాలురు, 157 మంది బాలికలు ఉత్తీర్ణులయ్యారు. 82.55 శాతంతో ఈ విద్యాసంస్థలు ఏడో స్థానంలో నిలిచాయి. మున్సిపల్ పాఠశాలల నుంచి 1,196 బాలురు, 1,236 మంది బాలికలు పరీక్షలు రాయగా, 914 మంది బాలురు, 1,050 మంది బాలికలు ఉత్తీర్ణత సాధించి 80.76 శాతంతో ఎనిమిదో స్థానంలో నిలిచారు. 80 శాతం ఉత్తీర్ణతో ఆంధ్రప్రదేశ్ రెసిడెన్సియల్ విద్యాసంస్థలు తొమ్మిదో స్థానంలో నిలిచాయి. ఈ పాఠశాలల నుంచి 30 మంది విద్యార్థుల్లో 24 మంది ఉత్తీర్ణులయ్యారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు 71.36 శాతంతో పదో స్థానంలో నిలిచాయి. మొత్తం 6,832 మంది విద్యార్థుల్లో బాలికలు 3,625, బాలురు 3,207 మంది పరీక్షలకు హాజరయ్యారు. వారిలో 2,744 మంది బాలికలు, 2131 మంది బాలురు ఉత్తీర్ణులయ్యారు. గిరిజన సంక్షేమ శాఖ పాఠశాలలు 70.45 శాతం ఉత్తీర్ణతతో 11వ స్థానంలో నిలిచాయి. ప్రభుత్వ పాఠశాలలు 12వ స్థానంలో నిలిచాయి. 162 మంది బాలురకుగాను 78 మంది, 26 మంది బాలికలకు గాను 14 మంది ఉత్తీర్ణులయ్యారు. 48.94 శాతం ఉత్తీర్ణతను నమోదు చేసుకున్నాయి.

సమస్యలతో సహవాసం

(5వ పేజీ తరువాయి)

జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఒకసారి సమావేశం నిర్వహించినా, అది అధికారులను పరిచయం చేసుకునే కార్యక్రమంగానే పరిగణించారు. ఈ సమావేశంలోనైనా జిల్లా సమస్యలపై దృష్టి సారిస్తారా అనే చర్చ ప్రధానంగా నడుస్తోంది.

రైతు కష్టాలు

గత ఖరీఫ్, రబీసీజన్‌లకు సంబంధించి జిల్లాలో లక్ష టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంది. జిల్లాలో 10 వేలహెక్టార్లలో రబీ సీజన్‌లో వరిసాగు చేశారు. ప్రస్తుతం వరికోతలను యంత్రాల ద్వారా పూర్తి చేస్తున్నారు. ప్రభుత్వం రబీ సీజన్‌లో ధాన్యం కొనుగోలుకు అనుమతులు కూడా ఇచ్చింది. రబీ సీజన్ ధాన్యం మిల్లర్లు మద్దతు ధరకు కొనుగోలు చేయడం లేదు. ధాన్యంలో తేమశాతం, నూకశాతం అధికంగా ఉందనే కారణంతో బస్తా ధాన్యం రూ.1,725లకు బదులుగా రూ.1,200లకు కొనుగోలు చేస్తున్నారు. బాయిల్డ్ రైస్ మిల్లులకు అయితేనే ఈ ధాన్యం పనికొస్తుందని, ఈ మిల్లుల ద్వారా ధాన్యం కొనుగోలుకు టార్గెట్‌లు ఇవ్వలేదనే కారణం చూపి ధాన్యం ధరలను తగ్గించి మరీ కొనుగోలు చేస్తున్నారు. తాము నిర్ణయించిన ధరకు ధాన్యం విక్రయించేందుకు ముందుకు వస్తేనే రైతులకు గోనె సంచులను మిల్లర్లు ఇస్తున్నారు. రబీ సీజన్‌లో ఎకరానికి 45 నుంచి 50 బస్తాల దిగుబడి వస్తున్నా ధాన్యం ధరలో కోత పెట్టడంతో రైతులు ఇబ్బందుల పాలవుతున్నారు.

మరమ్మతులకు నోచుకోని కాలువలు

జూన్ 1వ తేదీ నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతుంది. కృష్ణాడెల్టాలో వరిసాగు నిమిత్తం జూన్ 10వ తేదీన సాగునీటిని విడుదల చేస్తే అక్టోబరు నెలలోనే వరికోతలు పూర్తి చేయడానికి అవకాశం ఉంటుంది. జూలై, ఆగస్టు నెలల్లో కాలువలకు సాగు నీటిని విడుదలచేస్తే సాగు ఆలస్యమై నవంబరు, డిసెంబరు నెలల్లో కురిసే భారీ వర్షాలకు పంట దెబ్బతింటోంది. జిల్లాలో ఈ ఏడాది పంట కాలువలు, డ్రైనేజీలలో 722 ఓఅండ్ఎం పనులు చేసేందుకు రూ.36.72 కోట్లతో అంచనాలను రూపొందించి నివేదికను ప్రభుత్వానికి పంపారు. ఈ పనులకు అనుమతులు రావాల్సి ఉంది. మచిలీపట్నం, అవనిగడ్డ నియోజకవర్గాల్లో ఎనిమిది అవుట్‌ఫాల్ స్లూయిస్‌గేట్లకు కనీస మరమ్మతులు చేసేందుకు రూ.38 కోట్లతో అంచనాలు రూపొందించారు.

కాలనీల్లో వసతులు కరవు

జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో 665 లేఅవుట్‌లు ఉన్నాయి. వీటిలో 86,084 గృహాలను నిర్మాణం చేయాల్సి ఉంది. 28,456 గృహాలకుపైగా ఇప్పటివరకు నిర్మాణం చేశారు. 29,080 గృహాల నిర్మాణం ఇంకా ప్రారంభమే కాలేదు. 28,548 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి. అన్ని మండలాల్లో లేఅవుట్‌లలో రోడ్ల నిర్మాణం, తాగునీటి పైపులైన్లు, విద్యుత్ లైన్‌ల పనులు చేపట్టే అంశంపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో చూడాలి.

రాయితీ రాక ఆక్వా రైతుల అవస్థలు

జిల్లాలో ఈ ఏడాది 32,804 ఎకరాల భూమిని ఆక్వా జోన్ పరిధిలోకి తేవాలని నిర్ణయించారు. రొయ్యల చెరువులకు విద్యుత్ సబ్సిడీ రాకపోవడంతో రైతులు ఇబ్బందుల పాలవుతున్నారు. రొయ్యల చెరువులకు విద్యుత్ రాయితీ ఇచ్చే అంశంపైనా ఈసమావేశంలో నిర్ణయం తీసువాలని రైతులు కోరుతున్నారు.

కొలిక్కిరాని పాఠశాలల విలీనం

జిల్లాలో పలు పాఠశాలల విలీనంపై కసరత్తు జరుగుతోంది. గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాల ఖచ్చితంగా ఉండాలనే డిమాండ్ ప్రజల నుంచి వస్తోంది. పాఠశాలల విలీనంపై ఇంకా గందరగోళ పరిస్థితులున్నాయి.ప్రభుత్వ పాఠశాలలు గ్రామాల్లో కొనసాగే విధంగా చర్యలు తీసుకోవాలనే డిమాండ్ ఉంది. బందరు పోర్టు, గిలకలదిండి హార్బర్ పనులను వేగవంతం చేయడంపైనా ఈ సమావేశంలో చర్చించాల్సిన అవసరం ఉంది.

ఆ నాలుగు సంస్థలకు కట్టబెట్టేందుకే..!

(5వ పేజీ తరువాయి)

చాలా పెద్దది. రైల్వే పనులను కూడా చేపట్టిన సంస్థ. ఈ సంస్థ టర్నోవర్ కూడా ఎక్కువే. ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడి బ్రాంచ్ ఆఫీసుతో జీఎస్టీ రిజిస్ట్రేషన్ కూడా కలిగి ఉంది. ఈ సంస్థను తప్పిస్తే ఆ నాలుగు సంస్థలకు పోటీ అనేది లేకుండా టెండర్లను కట్టబెట్టేయవచ్చు అన్నది జిల్లా యంత్రాంగం ప్లాన్‌గా ఉన్నట్లు సమాచారం. ఈ సంస్థ ఎన్టీఆర్ జిల్లాలో జీఎస్టీ రిజిస్ట్రేషన్ కలిగి ఉండటంతో.. మళ్లీ టెండర్లలో పాల్గొనాలంటే మార్చి 31వ తేదీ లోపు కృష్ణాజిల్లాలో స్థానికంగా జీఎస్టీని రిజిస్ట్రేషన్ చేసుకోవటం కుదరదు కాబట్టి.. ఈ పెద్ద సంస్థను టెండర్లలోనే పాల్గొనకుండా చేయొచ్చు అనేది వ్యూహంగా ఉందని తెలుస్తోంది.


గో-వృషభ కల్యాణం నిర్వహిస్తున్న కళ్యాణ కర్తలు

ఘనంగా గో-వృషభ కల్యాణం


పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెగా గో-వృషభరాజములు

అవనిగడ్డ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : అవనిగడ్డ శివారు బందలాయిచెరువు గ్రామంలో లోక క్షేమం, పశు సంపద వృద్ధి కోసం గో-వృషభ కల్యాణం వైభవంగా నిర్వహించారు. స్థానిక ఆంజనేయ స్వామి ఆలయం వద్ద సింహాద్రి నారయ్య వంశీయులచే గో-వృషభ కల్యాణం చేశారు. సింహాద్రి రామచంద్రరావు - వెంకటేశ్వరమ్మ, సింహాద్రి మనోజ్ - సంధ్య దంపతులు వృషభం తరపున, కమ్మిలి రవి, లక్ష్మీ దంపతులు గోమాత తరపున తల్లిదండ్రులుగా వ్యవహరించి వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ కల్యాణ తంతును జరిపించారు. కార్యక్రమంలో అవనిగడ్డ మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, కుమారుడు సింహాద్రి వికాస్‌లు పాల్గొని పూజాధికాలు నిర్వహించారు.

పరీక్షల్లో ఫెయిల్ అయ్యాడని..

విద్యార్థి ఆత్మహత్య!


అనీల్ కుమార్

బంటుమిల్లి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పరీక్షల్లో ఫెయిల్ అయ్యాడని ఓ విద్యార్థి అత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. బంటుమిల్లి మండలంలోని పెద తుమ్మిడి పంచాయతీ అర్జవాని గూడెంకు చెందిన గోవాడ రామకృష్ణ మినీవ్యాన్ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమార్తె ప్రయివేట్ స్కూల్లో తొమ్మిదో తరగతి చదువుతుంది. కుమారుడు గోవాడ అనీల్ కుమార్ పెదతుమ్మిడి జడ్పీ హైస్కూల్లో గతేడాది 10వ తరగతి పరీక్షలు రాయగా ఫెయిల్ అయ్యాడు. తిరిగి ఈ ఏడాది మార్చిలో పరీక్ష రాశాడు. ఫలితాల్లో మళ్లీ ఫెయిల్ కావడంతో మనస్థాపానికి గురై బుధవారం ఉదయం ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కొడుకు మృతితో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు. రెక్కల కష్టంతో చదివిస్తూ పిల్లల భవిష్యత్తుపై ఎన్నో ఆశలు పెట్టుకున్న తల్లిదండ్రులకు అనీల్ కుమార్ మృతి కడుపుకోతను మిగిల్చింది.

విద్యుదాఘాతంతో మృతి చెందిన

తండ్రికి తలకొరివి పెట్టిన చిన్నారి


తండ్రికి దహన సంస్కారాలు నిర్వహిస్తున్న చిన్నారి

గుడివాడ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : ధైర్యసాహసాలతో విద్యుత్ ప్రమాదం నుంచి బాలుడ్ని రక్షించి ఆ కుటుంబంలో వెలుగులు నింపాడు.. అంతలోనే అదే విద్యుత్‌కు తాను బలయ్యాడు.. తన కుటుంబాన్ని చీకటి చేసుకున్నాడు.. గుడివాడ మండలం మల్లాయిపాలెం శివారు టిడ్కో కాలనీలో బాలుడిని రక్షించబోయి విద్యుత్ షాక్ గురై తాపీ కార్మికుడు తేజ(27) ప్రాణాలు కోల్పోయిన ఘటన మంగళవారం జరిగింది. కూలీ పనుల నిమిత్తం జగ్గయ్యపేట నుంచి వచ్చి గుడివాడ టిడ్కో కాలనీలో కుటుంబంతో ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. బాలుడిని రక్షించేందుకు తేజ తన ప్రాణాన్నే ప్రాణాన్ని పణ్ణంగా పెట్టాడు. బుధవారం తండ్రి పార్థివ దేహానికి అభం శుభం తెలియని చిన్నారి కొడుకు దహన సంస్కారాలు నిర్వహించడం చూపరులకు కంటతడి పెట్టించింది.

తేజ కుటుంబానికి న్యాయం చేయాలి

పరోపకారానికి పోయి ప్రాణాలు పోగొట్టుకున్న తేజ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే నిండుప్రాణం బలైందని వైపీ మురళీకృష్ణ అన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	120, 129, 140
చికెన్ విత్ స్కిన్	226
చికెన్ స్కిన్‌లెస్	236



నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 420

ఉపాధి పనులతో పర్యావరణ పరిరక్షణ

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకం ద్వారా అభివృద్ధి పనులతో పాటు కూలీలకు చేయూత అందుతుందని సర్పంచ్ కాటూరి విజయ భాస్కర్ అన్నారు. బొమ్ములూరులో ఇటీవల అభివృద్ధి చేసిన హిందూ శ్మశానవాటిక ప్రహరీ వెంబడి కొయ్యూరు రహదారికి ఇరువైపులా బుధవారం మొక్కలు నాటారు.



పది ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల హవా

పెనమలూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : పదవ తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించినట్లు ఎంఈవో కనకమహాలక్ష్మి తెలిపారు. పెనమలూరు ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎన్ తేజశ్రీ 582, యనమలకుదురు హైస్కూలుకు చెందిన ఎండీ ఖుద్దూస్ 578, పెనమలూరు ఉన్నత పాఠశాల విద్యార్థిని ఆర్ పావని 577 మార్కులతో మొదటి మూడు స్థానాలను కైవసం చేసుకొన్నారని ఎంఈవో తెలిపారు. వణుకూరు, పెనమలూరు పాఠశాలల్లో 79 శాతం, యనమలకుదురు పాఠశాలో 75 శాతం, కానూరు ఉన్నత పాఠశాలలో 68 శాతం, తాడిగడప ఉన్నత పాఠశాలలో 58 శాతం, పోరంకి ఉన్నత పాఠశాలలో 64 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో తెలిపారు.



తేజశ్రీ 582 | ఖుద్దూస్ 578 | మౌనిక 579 | శ్రీమహాలక్ష్మి 570 | అఫ్రిన్ సుల్తాన 577 | సాయికుమార్ 580 | రమ్యశ్రీ 579



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినులను అభినందిస్తున్న బాపులపాడు హెచ్‌ఎం

కంకిపాడు : కంకిపాడు జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుతున్న చిట్టూరి మౌనిక 579 మార్కులు సాధించి మండలంలో మొదటి స్థానంలో నిలవగా, అదే పాఠశాలకు చెందిన సీహెచ్ శ్రీమహాలక్ష్మి 570, మద్దూరు జెడ్పీ పాఠశాల విద్యార్థిని తమ్మా మహాలక్ష్మి 561 మార్కులతో రెండు, మూడు స్థానాల్లో నిలిచారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ఆయా గ్రామాల సర్పంచులు అభినందించారు.

ఉయ్యూరు : టెన్త్ ఫలితాల్లో ఉయ్యూరు విద్యార్థులు మంచి మార్కులు సాధించారు. ఉయ్యూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని షేక్ అఫ్రిన్ సుల్తాన 577 మార్కులు సాధించి మండల ప్రభుత్వ పాఠశాలల్లో టాపర్‌గా నిలిచింది. ఏపీటీడబ్ల్యు ఆర్ బాయస్ హైస్కూల్ విద్యార్థి బి వెంకటసాయి 552, ఆకునూరు ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని జె గాయత్రి 551 మార్కులు సాధించారు. మండలపరిధిలో పరీక్షకు హాజరైనవారిలో 65 శాతం మంది ఉత్తీర్ణత సాధించినట్లు డీవైఈఓ పద్మారాణి తెలిపారు.

హనుమాన్‌జంక్షన్ : బాపులపాడు జడ్పీ హైస్కూల్ విద్యార్థిని వేములపల్లి మానసవీణ 537 మార్కులు సాధించి పాఠశాల ప్రథమ స్థానంలో నిలిచింది. జి.హేమలత 535, కె.స్వప్న 528 మార్కులు సాధించి ద్వితీయ, తృతీయ స్థానాలు సొంతం చేసుకున్నట్లు హెచ్‌ఎం టీవీ.నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం పాఠశాలలో ముగ్గురు విద్యార్థినిలను అభినందించి జ్ఞాపికలు అందజేశారు. పాఠశాల నుండి 66 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 50 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : పదవ తరగతి ఫలితాల్లో బాపులపాడు మండలంలోని గ్రామీణ ప్రాంత విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చాటారని ఎంఈవో రాంబా లాసింగ్ బుధవారం అభినందించారు. వీరవల్లి హైస్కూల్‌లో చదువుతు న్నరంగన్నగూడెంకు చెందిన దేవరకొండ హేమంత్ సాయికుమార్ 580 మార్కులతో ప్రథమ, కానుమోలు హైస్కూల్‌లో చదువుతున్న రమ్యశ్రీ 579 మార్కులతో ద్వితీయ స్థానం సాధించారన్నారు.

ఉంగుటూరు : మండలంలో పదవతరగతి పరీక్షా ఫలితాల్లో ప్రభుత్వపాఠశాలల విద్యార్థులు సత్తా చాటారు. ఆత్కూరు జడ్పీహైస్కూల్‌కు చెందిన షేక్ అమీనా 586 మార్కులతో మండలంలో తృతీయస్థానం సాధించారు. కాగా మండల వ్యాప్తంగా తొమ్మిది ప్రభుత్వ పాఠశాలల్లో సగటున 83శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు ఎంఈవో-2 జె.సాంబశివరావు తెలిపారు. ఈసందర్భంగా మండలంలో ఫస్ట్, సెకండ్ ర్యాంకులతో టాపర్స్‌గా నిలిచిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను ఎంఈవో అభినందించారు.

విజయవాడ రూరల్ : పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో నున్న గ్రామ జడ్పీహైస్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. పాఠశాలకు చెందిన గుంట ప్రణతి 578 మార్కులతో ద్వితీయ స్థానం, కాటూరి కారుణ్య 576 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం భూపాలరెడ్డి వారిని అభినందించారు.

గన్నవరం : మండలంలో పదవ తరగతి పరీక్షల్లో 66 శాతం ఉత్తీర్ణులయ్యారు. వీరపనేనిగూడెం గురుకుల పాఠశాల విద్యార్థిని ఎస్.ప్రశాంతి (573) మార్కులతో మండలంలో ప్రథమస్థానం సాధించగా, ద్వితీయ స్థానాన్ని కేసరపల్లి జడ్పీహైస్కూల్ విద్యార్థిని యార్లగడ్డ లక్ష్మీప్రసన్న (572) సాధించినట్లు ఎంఈవో కొండా రవికుమార్ తెలిపారు.

ప్రసాదంపాడు : నిడమానూరు జడ్పీ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని హెచ్‌ఎం ఉషారాణి అన్నారు. పది ఫలితాల్లో తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు 73 శాతంతో ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు. రాచమళ్ల డింపుల్ ప్రియ 581 మార్కులతో ప్రథమ స్థానం, అల్లిపురపు భార్గవి అఖిల 573 మార్కులతో రెండవ స్థానం సాధించార న్నారు. రామవరప్పాడు జడ్పీ విద్యార్థిని ఎం. సాయి సింధు 589, నక్కరాజు కుసుమ 588, జొన్నలగడ్డ హాసిని సాత్విక 583 మార్కులు సాధించి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించినట్లు హెచ్‌ఎం మంగతాయారు తెలిపారు.



ప్రశాంతి 573 | లక్ష్మీప్రసన్న 572 | డింపుల్‌ప్రియ 581 | భార్గవి అఖిల 573 | సాయిసింధు 589 | కుసుమ 588

ఉంగుటూరు : ఆత్కూరు జడ్పీహైస్కూల్‌కు చెందిన షేక్ అమీనా 586 మార్కులతో తృతీయస్థానం సాధించి టాపర్స్‌గా నిలిచారు. కాగా మండలవ్యాప్తంగా తొమ్మిది ప్రభుత్వపాఠశాలల్లో సగటున 83శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు ఎంఈవో-2 జె.సాంబశివరావు తెలిపారు.

శ్రీశ్రీనివాస అక్షరాలయం విద్యార్థులకు మంచి మార్కులు

ఉయ్యూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : టెన్త్ ఫలితాల్లో శ్రీశ్రీనివాస అక్షరాలయం విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించగా 95శాతం ఉత్తీర్ణత సాధించి విజయభేరీ మోగించారు. జి అనూష 587 మార్కులు సాధించింది. ఉత్తీర్ణ సాధించిన వారిలో ఎక్కువ మంది 550పైగా మార్కులు సాధించారని విద్యార్థుల కృషి, పట్టుదల, ఉపాధ్యాయుల నిబద్ధత, తల్లిదండ్రుల సహకారం ఫలితంగా ఉత్తమ ఫలితాల సాధించామని విద్యా సంస్థల డైరెక్టర్ పరుచూరి శ్రీనివాసరావు తెలిపారు. విద్యార్థులను శ్రీనివాసరావు, నీలిమ అభినందించారు.



ఘనంగా సుదర్శన హోమం

హనుమాన్‌జంక్షన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : స్థానిక వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాల్గవ రోజు బుధవారం సుదర్శన హోమం ఘనంగా నిర్వహించారు. ఈవో వై.శ్రీనివాసరావు పర్యవేక్షణలో అర్చకులు చక్రావధానుల సీతారామాచార్యులు ఆధ్వర్యంలో వేద పండితులు సుదర్శనహోమం జరిపారు. ట్రస్టీలు కాకాని అరుణ, తవ్వా పూర్ణచంద్రరావు, సుంకర సుభాష్ చంద్రబోస్, యలమంచిలి మూర్తి, గుమ్మడి శేషగిరిరావు, పలువురు స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.



వైభవంగా అభయాంజనేయస్వామి విగ్రహప్రతిష్ఠ

ఉంగుటూరు : ఆముదాలపల్లిలో బుధవారం అభయాంజనేయస్వామి విగ్రహప్రతిష్టా మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ నిర్వాహకులు గుత్తా అనిల్‌కుమార్ పర్యవేక్షణలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. సుమన్ ఫౌండేషన్ ఛైర్మన్ గుత్తా సుమన్‌కుమార్ సౌజన్యంతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. నూతన విగ్రహ ప్రతిష్ఠకు సహకరించిన స్థలదాతలు దాసరి అప్పారావు, వెంకటరంగారావు (చంటియ్య), విగ్రహం దాతలు పోతినేని వెంకటరత్నం, గోవర్ధన్‌రావు, కోటేశ్వరరావులను సత్కరించారు.



మేలుజాతి పశుపోషణను ప్రోత్సహిస్తాం

ఉంగుటూరు : అధిక పాలసాంద్రత కలిగిన మేలుజాతి పశుపోషణను ప్రోత్సహించటంద్వారా పాడిపరిశ్రమను లాభసాటిగా మార్చేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి వుందని టీడీపీ మండల అధ్యక్షుడు ఆరుమళ్ల వెంకటకృష్ణారెడ్డి అన్నారు. గన్నవరం ఎన్టీఆర్ పశువైద్యకళాశాల జాతీయసేవాపథకం(ఎన్ఎస్ఎస్)ఆధ్వర్యంలో తేలప్రోలు పశువైద్యశాలలో బుధవారం నిర్వహించిన ఉచిత పశువైద్యశిబిరాన్ని సర్పంచ్ లాం దిబోరాతో కలిసి ఆయన ప్రారంభించారు.



కాటూరులో సామూహిక సీమంతం



ఉయ్యూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : ఐసీడీఎస్ కంకిపాడు ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడ పథకంలో భాగంగా కాటూరులో బుధవారం 16 మంది గర్భిణులకు సామూహిక సీమంతం నిర్వహించారు. ఎంపీడీవో శేషగిరిరావు ముఖ్య అతిధిగా హాజరై మహిళలకు పసుపు, కుంకుమ, చీర పంపిణీ చేశా రు. కాటూరు ఆశాజ్యోతి సూపర్‌వైజర్ బేబీ సరోజిని, హిమతేజస్వి పాల్గొన్నారు.

కశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడి బాధాకరం

గన్నవరం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : కశ్మీర్‌లోయలో ఉగ్రవాదుల దాడి యావత్తు దేశాన్ని తీవ్రంగా కలచివేసిందని బీజేపీ నాయకురాలు కానూరి శేషుమాధవి అన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు నీలం అశోక్ ఆధ్వర్యంలో ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ బుధవారం రాత్రి కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన 21మంది అమాయకుల ఆత్మశాంతి చేకూరాలని కోరారు. మాజీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, నీలం అశోక్, మేడూ రి శేషు బాబు, రామకోటి, వెంకటకృష్ణ, అనిల్ పాల్గొన్నారు. **ఉయ్యూరు :** కశ్మీర్ లోయలో ఉగ్రవాదుల దుశ్చర్యను వ్యతిరే కిస్తూ దేశ ప్రజ లంతా ఒక్కతాటిపై నిలిచి ఉగ్రవాదాన్ని తుదముట్టించే ప్రభుత్వ చర్యలకు అండగా నిలవాలని పలువురు అభిప్రా యపడ్డారు. కశ్మీర్‌లో మంగళవారం ఉగ్రవాదులు 30 మంది పర్యాటకులను కిరాతకంగా కాల్చిచంపడాన్ని నిరసిస్తూ ఉయ్యూరు వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ప్రధాన సెంటర్‌లో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు కోడె సాంబశివరావు, తిరుమలరావు, రాంబాబు, నెహ్రూ, శ్రీనివాస్, రాజు, ప్రభుత్వవైద్యశాల అభివృద్ధి కమిటీ ఛైర్మన్ జయ దేవ్, పొగిరి రాము తదితరులు పాల్గొని ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.



గన్నవరంలో కొవ్వొత్తుల ర్యాలీ.. ఉయ్యూరు వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

ఆక్రమణల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోండి

ఉయ్యూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : అభ్యంతరం కాని ప్రభుత్వ భూముల్లో ఇళ్లు, పాకలు నిర్మించుకుని నివాసముంటున్న వారి ఆక్రమణలో ఉన్న భూములు క్రమబద్ధీకరించుకునేందుకు ప్రభుత్వం 30 నంబరు జీవో జారీ చేసినట్టు ఉయ్యూరు మండల తహసీల్దార్ సురేశ్‌కుమార్ తెలిపారు. అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల్లో 150 గజాల వరకు బీపీఎల్ లేక ఏపీఎల్ క్యాటగిరి వారు ఉచితంగా క్రమబద్ధీకరించు కోవచ్చని, 150 గజాలపైబడి ఆక్రమణ ఉన్న యెడల ఏపీఎల్ ఫ్యామిలీ వారు నార్మల్ రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలని, బీపీఎల్ ఫ్యామిలీ వారు రిజిస్ట్రేషన్ ఫీజులో 50 శాతం మాత్రమే చెల్లించవలసి ఉంటుందన్నారు. అభ్యంతరం కాని ఆక్రమణల భూములు క్రమబద్ధీకరించుకునే వారు గ్రామ సచివాలయాల్లో అర్జీ దాఖలు చేసుకోవాలని తెలిపారు.

క్రమశిక్షణతో విద్యలో రాణించాలి

సర్పంచ్ బడుగు బాలమ్మ

గన్నవరం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు క్రమశిక్షణతో చదువులో రాణించాలని సర్పంచ్ బడుగు బాలమ్మ అన్నారు. మండలంలోని దావాజీగూడెం ప్రభుత్వ మోడల్ ఫౌండేషన్ స్కూల్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో వలు పోటీల్లో రాణించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ బాలమ్మ మాట్లాడుతూ, ఆటపాటలతో కూడిన విద్య విద్యార్థుల్లో మానసిక, శారీరక ఎదుగుదలకు దోహదప డుతుంద న్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అన్ని వసతులు కల్పించటం అభినం దనీయమన్నారు. పిల్లల చదువు విషయంలో ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు కూడా శ్రద్ధ వహించాలని స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం దుగ్గిరాల ఝాన్సీరాణి అన్నారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అల రించాయి. హెచ్‌ఎం జంగం కుమారి, అన్నే లక్ష్మీదుర్గ, రత్నకుమారి పాల్గొన్నారు.



బహుమతులు పొందిన విద్యార్థులతో సర్పంచ్ బడుగు బాలమ్మ

భక్తులకు సేవే సమరసత లక్ష్యం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : భక్తులకు సేవలందిస్తూ ఆసక్తిగల వారికి పూజోత్సవాల్లో పాల్గొనేందుకు సహకారం అందించడమే సమరసత సేవా ఫౌండేషన్ లక్ష్యమని ధర్మ ప్రచారక్ యడవల్లి పాండురంగారావు అన్నారు. కానుమోలు, బాపులపాడు, రేమల్లె, రంగన్నగూడెం గ్రామాల నుంచి 130 మంది భక్తులు శ్రీవారి మెట్ల పూజోత్సవంలో పాల్గొనేందుకు సమరస త ఆధ్వర్యంలో బుధవారం తెల్లవారుఝామున బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో మహంతి శ్రీని వాసరావు, మండవ రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.



మచిలీపట్నం అభివృద్ధికి బృహత్తర ప్రణాళిక

● మంత్రి కొల్లు రవీంద్ర ● రూ.171 కోట్లతో డ్రైన్ల పూడిక ● రూ. 100 కోట్లతో పీ4 పద్ధతిలో పనులు
● రూ. 120 కోట్లతో స్వదేశీ దర్శన్ కింద పనులు

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మచిలీపట్నం నగరాభివృద్ధికి బృహత్తర ప్రణాళిక రూపొందించినట్లు మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. బుధవారం టీడీపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.171 కోట్లతో డ్రైన్లలో పూడికతీత పనులు జరుగుతున్నాయన్నారు. పీ4 పద్ధతిలో రూ.100 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు ప్రణాళిక రూపొందించామన్నారు. డంపింగ్ యార్డు స్థానంలో అక్టోబరు 2 నాటికి నూతన పార్కు నిర్మిస్తామన్నారు. శ్మశానాల అభివృద్ధికి డీపీఆర్‌లు తయారు చేశామని, ఇందుకు దాతలు ముందుకు వస్తున్నారన్నారు. స్వదేశీ దర్శన్ కింద రూ.120 కోట్లతో ప్రణాళికలు రూపొందించామన్నారు. రోల్డుగోల్డు కవరింగ్, కలంకారీ, ఫిషరీస్‌లకు నూతన శోభను కల్పిస్తామన్నారు. రాష్ట్రంలో ఏడాదికి రూ. 33వేల కోట్లను పింఛన్లకు అందిస్తున్నామన్నారు. కోటి మందికి ఉచిత గ్యాస్ సిలెండర్లు అందిస్తున్నామన్నారు. డీఎస్సీ ద్వారా 16వేల టీచర్ల పోస్టులు భర్తీ చేస్తున్నామన్నారు. సీఎస్ఆర్ నిధులు తీసుకునివచ్చి నగరాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. కోనేరుసెంటర్, మునిసిపల్ కార్యాలయం, బేబీసెంటర్, పాత కూరగాయల మార్కెట్‌లను పీ4 పద్ధతిలో రూ.100 కోట్లతో అభివృద్ధి చేస్తామన్నారు. శ్మశానాన్ని రూ.కోటి 50 లక్షలతో అభివృద్ధి చేస్తామని, దీనికి దాతలు ముందుకు వస్తున్నారన్నారు. మార్కెట్ యార్డు చైర్మన్ కుంచే నాని, మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, టీడీపీ నగరాధ్యక్షుడు ఎండీ ఇలియాస్ పాషా, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గోపు సత్యనారాయణ, మాజీ కౌన్సిలర్ పల్లపాటి సుబ్రహ్మణ్యం, తలారి సోమశేఖర్, అక్కుమహంతి రాజా, కార్పొరేటర్లు దేవరపల్లి అనిత, అన్నం ఆనంద్, లంకే శేషగిరి, రామధాని వేణు, గనిపిశెట్టి గోపాల్ పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర


పంచాయతీ కార్మికులతో మాట్లాడుతున్న పట్టాభిరామ్

సంపద సృష్టికి అడుగులు పడినట్టే..!

● స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్

మైలవరం రూరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): తడి, పొడిచెత్తను వేరు చేయగలిగితే చెత్త నుంచి సంపద సృష్టికి అడుగులు పడినట్టేనని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ అన్నారు. బుధవారం మైలవరంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ కోరిక మేరకు చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించానన్నారు. గ్రామపంచాయతీలో చెత్త సేకరణ ఎలా జరుగుతుందని పరిశీలించడంతోపాటు సేకరించిన చెత్తను ఎలా ప్రాసెస్ చేస్తున్నారు, తడిచెత్తను ఎలా కంపోస్టుగా మారుస్తున్నారు, పొడిచెత్త నుంచి వచ్చే ప్లాస్టిక్, క్లాత్ ఎలా రీసైకిల్ చేస్తున్నారో పరిశీలించానన్నారు. వెయింగ్ చెకింగ్‌లో, చెత్తను ప్రతిరోజు పీఆర్ వన్ యాప్‌లో అప్లోడ్ చేయడంలో ఖచ్చితత్వం పాటించాలని అధికారులకు తెలిపారు. సీఎం చంద్రబాబు స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్రలో భాగంగా 3వ శనివారం ప్రజలను మమేకం చేస్తున్నారన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో రూ.800 కోట్లు స్వచ్ఛాంధ్రకు కేటాయించడం చంద్రబాబుకి స్వచ్ఛతపై ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. గత ప్రభుత్వం పట్టణాల్లో వదిలివెళ్లిన 85 లక్షల టన్నుల చెత్తను ఎలా క్లియర్ చేస్తున్నామో, గ్రామాల్లో పేరుకుపోయిన చెత్తను త్వరలోనే డ్రోన్ల ద్వారా గుర్తించి క్లియర్ చేసేందుకు చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఆదేశించారన్నారు. వచ్చే 5 నెలల్లో గ్రామాల్లో చెత్తకు స్వాగతం పలికే పరిస్థితిని మార్చటానికి కృషిచేస్తామన్నారు. డీఎల్పీవో రాఘవన్, పంచాయతీ కార్యదర్శి ఎండీ రఫీ, టీడీపీ నేతలు విజయబాబు, లంకా లితీష్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ చారుగొండ్ల ప్రసాద్, మల్లెల రాధాకృష్ణ, దూరు బాలకృష్ణ, వెంకట్రావు పాల్గొన్నారు.


ప్రమాణ స్వీకారోత్సవంలో మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి గోపీ

న్యాయవాద వృత్తి ఎంతో పవిత్రమైనది

● జిల్లా న్యాయాధికారి గోపీ

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): న్యాయవాద వృత్తి ఎంతో పవిత్రమైనదని నూతనంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన బార్ అసోసియేషన్ ప్రతినిధులు పేద కక్షిదారులకు అండగా నిలబడాలని నూతనంగా జిల్లా జడ్జి పదవి స్వీకరించిన జస్టిస్ జి.గోపీ అన్నారు. నూతనంగా ఎన్నికైన మచిలీపట్నం న్యాయవాదుల సంఘ కార్యవర్గ ప్రమాణ స్వీకారంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దివి పోతురాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వివిధ న్యాయస్థానాలకు చెందిన న్యాయమూర్తులు పాల్గొన్నారు. ఎన్నికల అధికారి వింజమూరి శివరాం నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్లిన ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి దేవిసాయిశ్రావణి, మొబైల్ కోర్టు న్యాయమూర్తి వెంకట వాహిని, ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తి మేరీలను నూతన న్యాయవాదుల సంఘ కార్యవర్గ సభ్యులు సత్కరించారు. 6వ అదనపు జిల్లా న్యాయమూర్తి పి. పాండురంగారెడ్డి, జిల్లా పర్మినెంట్ లోక్ అదాలత్ న్యాయమూర్తి ఓ.వి. నాగేశ్వరరావు పాల్గొన్నారు. అనంతరం మంత్రి కొల్లు రవీంద్ర నూతనంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన పోతురాజును ఘనంగా సత్కరించారు. పి.వి. ఫణికుమార్ పాల్గొన్నారు.

కృష్ణా డీపీవో, జడ్పీ సీఈవోకు అవార్డులు


డీపీవో అరుణ, జడ్పీ సీఈవో కన్నమనాయుడు

మచిలీపట్నం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని అత్యుత్తమ సేవలు అందించిన అధికారులకు గురువారం ప్రభుత్వం అవార్డులను ప్రకటించింది. పంచాయతీరాజ్ విభాగంలో ఇంటింటి నుంచి చెత్తను సేకరించడం, స్వచ్ఛగ్రామాల ఏర్పాటు విభాగంలో కృష్ణాజిల్లా ముందంజలో నిలిచింది. దీంతో జిల్లా పంచాయతీ అధికారి జె అరుణ అవార్డుకు ఎంపికయ్యారు. అలాగే 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల, వినియోగంలో ఉత్తమ ఫలితాలు సాధించిన కృష్ణా జిల్లా జడ్పీ సీఈవో కె.కన్నమనాయుడు కూడా పురస్కారానికి ఎంపికయ్యారు. నేడు రాజధాని అమరావతిలో జరగనున్న జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవంలో వారు ఈ అవార్డులు అందుకోనున్నారు.

ఉరేసుకొని విద్యార్థిని ఆత్మహత్య

పెనమలూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్‌లో ఒక సబ్జెక్టు ఫెయిలయ్యాననే మనస్తాపంతో తానుండే హాస్టల్‌లో ఉరేసుకొని విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. హైదరాబాద్ మియాపూర్‌కు చెందిన యార్లగడ్డ శ్రీనివాసరావు కుమార్తె ఖ్యాతిశ్రీ (22) కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో 3వ సంవత్సరం చదువుతూ హాస్టల్‌లో ఉంటోంది. ఇటీవల విడుదలైన సెమిస్టర్ ఫలితాల్లో ఒక సబ్జెక్టులో ఫెయిలైంది. దీంతో మనస్తాపానికి గురై కొన్ని రోజులుగా డల్‌గా ఉంటోంది. మంగళవారం తన కుమార్తెతో మాట్లాడదామని తల్లి శివనాగమల్లీశ్వరి ఫోన్ చేయగా సమాధానం లేదు. అనుమానంతో తల్లి హాస్టల్ వార్డెన్‌కు ఫోన్ చేసి చూడమని చెప్పగా వార్డెన్ వెళ్లి చూడగా ఉరేసుకున్నట్టు గమనించి పోలీసులకు ఫోన్ చేశారు. వార్డెన్, స్టూడెంట్స్ ఆమెను కిందికి దించి ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందిందని వైద్యులు తెలిపారు. హైదరాబాద్ నుంచి వచ్చిన తల్లిదండ్రులు మృతదేహాన్ని చూసి కన్నీరుమున్నీరయ్యారు.

అమరావతిలో బయోడైవర్శిటీ పార్కులు!

ఆంధ్రజ్యోతి, విజయవాడ: అమరావతిలోనూ ఢిల్లీ తరహాలో బయోడైవర్శిటీ పార్కులను ఏర్పాటు చేయాలని అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీఎల్) భావిస్తోంది. ఢిల్లీలోని యమునా బయోడైవర్సిటీ పార్కును బుధవారం అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీ) సీఎండీ లక్ష్మీపార్థసారథి సందర్శించారు. ఢిల్లీలో యమునా, ఆరావళి బయో డైవర్సిటీ పార్కులను స్థాపించిన ఇన్‌చార్జ్ ప్రొఫెసర్ సీఆర్ బాబుతో ఆమె సమావేశమయ్యారు. రాజధానిలో అమరావతి హరిత ప్రాజెక్టుల అభివృద్ధిలో సహాయం అందించడానికి ఆరావళి బయో డైవర్సిటీ వారు అంగీకరించారు. ఈ సందర్భంగా సీఎండీ లక్ష్మీ పార్థసారథి అక్కడ తీపి నారింజ మొక్కను నాటారు. బయోడైవర్సిటీ పార్కుల అభివృద్ధిలో ప్రొఫెసర్ బాబు బృందం చేపట్టిన విధానాలను ఏడీసీ ప్రతినిధులను వివరించారు. ఈ పర్యటనలో ఏడీసీ హార్టికల్చర్ విభాగాధిపతి వీఎస్ ధర్మజ కూడా ఉన్నారు.

సామాన్యులకు 'మరుగు' లేదా!

▸ ప్రజలకు శౌచాలయం లేకుండా సమాచార కమిషనరేట్ నిర్వహణపై హైకోర్టు విస్మయం
▸ పరిశీలించి పరిష్కరించాలని సీఎస్‌కు ఆదేశం

అమరావతి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సమాచార కమిషన్ కార్యాలయంలో సామాన్య ప్రజల కోసం మరుగుదొడ్డి లేకపోవడంపై హైకోర్టు విస్మయం వ్యక్తం చేసింది. మరుగుదొడ్డి లేకుండా కార్యాలయం నిర్వహించడంపై ఆశ్చర్యం వ్యక్తం చేసింది. ఈ వ్యవహారాన్ని వ్యక్తిగతంగా పరిశీలించి పరిష్కారం కనుగొనాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌ను ఆదేశించింది. సమస్య పరిష్కారం కాకుంటే ఆన్‌లైన్ ద్వారా సీఎస్ హాజరుకు ఆదేశిస్తామని హెచ్చరించింది. అద్దె భవనంలో కార్యాలయం కొనసాగుతున్న నేపథ్యంలో మరుగుదొడ్డి ఏర్పాటు వీలుకాకుంటే తక్షణం కార్యాలయాన్ని మరో భవనానికి మార్చాలని సూచించింది. విచారణను ఈ నెల 30కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది. రాష్ట్ర సమాచార కమిషన్ కార్యాలయంలో కనీస మౌలికవసతులు కల్పించడంతో పాటు కార్యాలయాన్ని సందర్శించే సాధారణ ప్రజానీకం కోసం మరుగుదొడ్లు ఏర్పాటు చేసేలా రాష్ట్ర ప్రభుత్వం, ఏపీ సమాచార కమిషన్‌ను ఆదేశించాలని కోరుతూ న్యాయవాది బి.క్రాంతికుమార్ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం బుధవారం విచారణకు రాగా పిటిషనర్ తరఫు న్యాయవాది అభినవ్ కృష్ణ వాదనలు వినిపిస్తూ... కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులకు తప్ప సామాన్య ప్రజలకు మరుగుదొడ్లు లేవన్నారు. మరుగుదొడ్డి ఏర్పాటు విషయంలో భవన యజమానితో వివాదం కొనసాగుతోందన్నారు. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎస్‌జీపీ) ఎస్.ప్రణతి స్పందిస్తూ.. భవన యాజమానితో వివాదం వాస్తవమేనన్నారు. పూర్తి వివరాలు సమర్పించేందుకు సమయం ఇవ్వాలని అభ్యర్థించారు. ధర్మాసనం స్పందిస్తూ.. మరుగుదొడ్డి ఏర్పాటుకు అనుమతులు లేకుంటే యజమాని ఏమి చేయగలరని ప్రశ్నించింది.

వేసవి సెలవుల్లో ఆ మండలాల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తాం

▸ హైకోర్టుకు నివేదించిన రాష్ట్ర ప్రభుత్వం.. పిల్ పరిష్కారం

అమరావతి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా కరవు ప్రభావిత మండలాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ఈ వేసవి సెలవుల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం బుధవారం హైకోర్టుకు నివేదించింది. కేంద్ర ప్రభుత్వ నిధుల విడుదలతో సంబంధం లేకుండా పథకాన్ని అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు విద్యాశాఖ తరఫు ప్రభుత్వ న్యాయవాది గుర్రం రామచంద్రరావు కోర్టుకు తెలిపారు. ఈ వివరాలు నమోదు చేసిన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం పిల్‌ను పరిష్కరించింది. వేసవి సెలవుల్లో రాష్ట్రంలోని కరవు ప్రభావిత మండలాల్లో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదివే విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేసేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ కాకినాడకు చెందిన హెల్ప్ ది పీపుల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, మేనేజింగ్ ట్రస్టీ కీతినీడి అఖిల్ శ్రీ గురుతేజ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు.

రాజకీయ వ్యవస్థ ప్రజలను దోచుకోవడానికి కాదు!

▸ పార్టీల్లో అంతర్గత ప్రజాస్వామ్యం ఉండాలి: పీవీ రమేశ్

విజయవాడ (గాంధీనగర్), ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): రాజకీయ వ్యవస్థ ప్రజలకు సేవ చేయడానికి మాత్రమే గాని వారిని దోచుకునేందుకు, ప్రభుత్వ ఆస్తులను ఆక్రమించేందుకు కాదని సీనియర్ ఐఏఎస్ అధికారి పీవీ.రమేశ్ తెలిపారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రజల భాగ్యస్వామ్యం కీలకమని స్పష్టంచేశారు. జన చైతన్య వేదిక ఆధ్వర్యంలో "ఎన్నికల సంస్కరణల"పై విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. రాజకీయాలు కుల, మత, ప్రాంత, భాష ప్రాతిపదికన జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ పార్టీల్లో అంతర్గత ప్రజాస్వామ్యం ఉండాలని సూచించారు.

ఎయిడ్స్ కట్టడిపై రాష్ట్ర కౌన్సిల్ ఏర్పాటు

▸ చైర్మన్‌గా సీఎస్, 18 మంది సభ్యులు
▸ ప్రతిపాదనలకు సీఎం చంద్రబాబు ఆమోదం

అమరావతి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎయిడ్స్ వ్యాధిని కట్టడి చేయడంతో పాటు వ్యాధి నివారణకు ప్రభుత్వం నడుంబిగించింది. సంస్థాగతంగా యంత్రాంగాన్ని బలోపేతం చేయాలని నిర్ణయించింది. దీని కోసం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి చైర్మన్‌గా, 18 మంది సభ్యులతో కూడిన 'ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కౌన్సిల్'ను ఏర్పాటు చేసింది. ఈ మేరకు ఆరోగ్యశాఖ పంపించిన ప్రతిపాదనలను సీఎం చంద్రబాబు బుధవారం ఆమోదించారు. ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమాలు పర్యవేక్షించడం, విధానపరమైన నిర్ణయాలు తీసుకోవడంతో పాటు ఫలితాలను అంచనా వేయడం ద్వారా ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు కొత్తగా ఏర్పాటైన ఉన్నత స్థాయి మండలి ఏపీఎస్‌ఏసీ కృషి చేస్తుంది. వనరుల సమీకరణ, శాఖల మధ్య సమన్వయం, ప్రజల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం ద్వారా ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమాల పటిష్ఠ అమలు బాధ్యతను ఈ మండలికి ప్రభుత్వం అప్పగించింది. విశేషాధికారాలతో ఏర్పాటు కానున్న ఈ మండలి రాష్ట్రంలో ఎయిడ్స్ నియంత్రణ చర్యలు పటిష్ఠమైన అమలుకు అవసరమైన నాయకత్వాన్ని అందిస్తుంది. ఎయిడ్స్‌పై పోరాటానికి వివిధ ప్రభుత్వ శాఖలకు అందుబాటులో ఉన్న ఆర్థిక వనరులు, మౌలిక సదుపాయాల్ని సమన్వయంతో వినియోగించే వీలు కల్పిస్తుంది.

సీహెచ్‌వోలు తక్షణం ఆందోళనలు విరమించాలి

▸ ఆరోగ్యశాఖ కమిషనర్ వీరపాండియన్

అమరావతి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): తమ వేతనాలు పెంచాలని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు (సీహెచ్‌వోలు) చేపట్టిన ఆందోళనను తక్షణమే విరమించుకోవాలని ఆరోగ్యశాఖ కమిషనర్ వీరపాండియన్ కోరారు. దేశంలోనే అత్యధికంగా ఏపీలోనే వారికి వేతనాలు ఇస్తున్నామన్నారు. సర్వీసు నిబంధనల్ని ఉల్లంఘించి గ్రామాల్లో వైద్య సేవలకు విఘాతం కల్పించవద్దని అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ నియమ నిబంధనలు, ఆర్థిక వనరుల లభ్యతను దృష్టిలో పెట్టుకుని సీహెచ్‌వోల డిమాండ్ల పరిశీలనకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో సీహెచ్‌వోలకు నెలకు రూ. 25 వేలు వేతనంతో పాటు పనితీరు ఆధారంగా గరిష్ఠంగా మరో రూ. 15 వేలు ప్రోత్సాహకంగా ప్రభుత్వం చెల్లిస్తోందని చెప్పారు. ఈ విధంగా వారికి నెలకు కనిష్ఠంగా రూ. 30,000, గరిష్ఠంగా రూ. 40 వేలు వరకూ చెల్లిస్తున్నామని తెలిపారు.

విద్యాహక్కు చట్టం అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానం

అమరావతి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): విద్యా హక్కు చట్టంలో భాగంగా ప్రైవేటు పాఠశాలల్లో పేద విద్యార్థులకు 25 శాతం అడ్మిషన్లు కల్పించే ప్రక్రియ ప్రారంభించినట్లు సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి ఒకటో తరగతిలో అడ్మిషన్ల కోసం తల్లిదండ్రులు పాఠశాల విద్యాశాఖ వెబ్‌సైట్ ద్వారా ఈనెల 28 నుంచి మే 15 వరకు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

బ్రాయిలర్ ధరలు
అమరావతి (రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్ 120, 129, 140
చికెన్ విత్ స్కిన్ 226
చికెన్ స్కిన్‌లెస్ 236
నెక్ కోడిగుడ్లు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 420

నేడు టీడీపీ విస్తృత సమావేశం

అవనిగడ్డ, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): టీడీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం చల్లపల్లిలో మచిలీపట్నం హైవే పక్కన ఉన్న శారద గ్రాండియర్ ఫంక్షన్‌హాలులో గురువారం జరుగుతుందని నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, ఇతర ముఖ్య నేతలు పాల్గొంటారని పేర్కొన్నారు. నియోజకవర్గానికి చెందిన వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, కార్యకర్తలు తప్పక హాజరుకావాలని ఆయన కోరారు.

చోరీకి పాల్పడిన ఇద్దరి అరెస్టు

గూడూరు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): కంచాకోడూరు గ్రామంలో ఈనెల 20వ తేదీన దొంగతనానికి పాల్పడిన మేడ సాయిగణేష్, కోళ్ల చరణ్ తేజను బుధవారం అరెస్టు చేశామని ఎస్సై కేఎన్వీ సత్యనారాయణ తెలిపారు. తన మేనమామ మానికొండ కృష్ణారావు డాబా ఇంటి తలుపులు పగులకొట్టి ఇంట్లోని ఏసీ, ఇన్వర్టర్, బీరువాలోని రెండు బంగారు ఉంగరాలు, మూడు లక్ష్మీదేవి రూపులు దొంగిలించినట్లు గ్రామానికి చెందిన ఈమని వెంకటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు దర్యాప్తు చేశారు. సాంకేతిక పరిజ్ఞానం సాయంతో కేసును ఛేదించారు. చోరీ చేసిన వస్తువులను రికవరీ చేసి నిందితులిద్దరిని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచామని ఎస్సై తెలిపారు.


చెక్కు అందజేస్తున్న టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు

బీమా చెక్కు అందజేత

అవనిగడ్డ, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): జింకపాలెం గ్రామానికి చెందిన పెద్దసింగు దుర్గారావు ఫిబ్రవరిలో సముద్రపు వేట చేస్తూ ప్రమాదవశాత్తు మృతి చెందాడు. ఆయన కుమారుడు కృష్ణారావుకు పార్టీ ద్వారా వచ్చిన ఇనూరెన్స్ మొత్తం రూ.5 లక్షల చెక్కును టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు కనపర్తి శ్రీనివాసరావు బుధవారం అందజేశారు.

అగ్ని బాధిత కుటుంబానికి పరామర్శ

నాగాయలంక, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పెదకమ్మవారిపాలెంలో మంగళవారం అర్ధరాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన టీడీపీ గ్రామ మాజీ అధ్యక్షుడు తలశిల సాంబశివరావును పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు బుధవారం పరామర్శించారు. ఇంటిలో ఉన్న రూ.3.5 లక్షల నగదు, ఆభరణాలు, విలువైన పత్రాలు, అగ్నికి ఆహుతయ్యాయి. దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, కోట సాయి, డీసీ చైర్మన్ బండ్రెడ్డి నాగ మల్లికార్జునరావు, మెండు లక్ష్మణరావు పాల్గొన్నారు.

సత్తా చాటారు

'పది' ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉత్తమ మార్కులు

- బందరు డివిజన్‌లో 78 శాతం ఉత్తీర్ణత
- 8 పాఠశాలల్లో నూరు శాతం ఉత్తీర్ణత

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మచిలీపట్నం డివిజన్ పరిధిలోని 109 ఉన్నత పాఠశాలల్లో 4,826 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయగా 3,740 మంది ఉత్తీర్ణులయ్యారు. డివిజన్ పరిధిలోని 12 మండలాల్లోని 109 పాఠశాలల్లో 8 పాఠశాలల విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ ఎనిమిదిలో మూడు ఎయిడెడ్ హైస్కూళ్లు ఉన్నాయి. పులిగడ్డ ఏపీ రెసిడెన్షియల్ స్కూలు, చోరంపూడి జిల్లాపరిషత్ హైస్కూలు, కంచడం హైస్కూలు, మచిలీపట్నం ఏవీకే ఓరియంటల్ ఎయిడెడ్ హైస్కూలు, వెంకటాపురం హైస్కూలు, మోపిదేవి ఎయిడెడ్ ఓరియంటల్ హైస్కూలు, పెదముత్తేవి ఎయిడెడ్ ఓరియంటల్ హైస్కూలు విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించారు.

డివిజన్‌లో మొదటి నాలుగు స్థానాలు..

బందరు డివిజన్‌లోని ఏపీ రెసిడెన్షియల్ స్కూలు, చెన్నూరు జిల్లాపరిషత్ పాఠశాల విద్యార్థులు 589 మార్కులతో ప్రథమ, మచిలీపట్నం వలందపాలెంలోని బాలికల రెసిడెన్షియల్ స్కూల్ 588 మార్కులతో రెండో స్థానం, కప్పలదొడ్డి హైస్కూల్ 586 మార్కులతో మూడోస్థానం, స్వతంత్రపురం హైస్కూల్, పులిగడ్డ ఏపీ రెసిడెన్షియల్ స్కూల్‌లు 584 మార్కులతో 4వ స్థానంలో నిలిచాయి.

చిలకలపూడి మునిసిపల్ హైస్కూలు విద్యార్థిని మెహరున్నీసాకు టౌన్ ఫస్ట్

పదో తరగతి పరీక్షా ఫలితాల్లో తాపీ మేస్త్రీ మహమ్మద్ షబ్బీర్ కుమార్తె మెహరున్నీసా నగరంలోని ప్రభుత్వ, మునిసిపల్ ఉన్నత పాఠశాలల్లో అత్యధికంగా 581 మార్కులు సాధించి టౌన్‌ఫస్ట్‌గా నిలిచింది. మచిలీపట్నం పూర్వ విద్యార్థులు, బందరు బంధువులు అందించే రూ. లక్ష బహుమతిని పొందేందుకు అర్హత సాధించింది. మెహరున్నీసాను, ఆమె తల్లితండ్రులను బందరు డీవైఈవో శేఖర్ సింగ్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు శ్రీరాం సత్కరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యూవీ కృష్ణమూర్తి పాల్గొన్నారు. నియోజకవర్గ పరిధిలో తపసిపూడి జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థి బి.నాగదుర్గవనితావాణిశ్రీ 574, చిన్నాపురం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థిని లంకా హరిత ప్రియ 557 మార్కులు, రుస్తుంబాద బాలుర పాఠశాల విద్యార్థి కాగిత మోహితమణికంఠ 555, నెలకుర్రు హై స్కూల్ విద్యార్థి బి.ప్రశాంతకుమారి 550 మార్కులు సాధించారు.


చిలకలపూడి మునిసిపల్ హైస్కూలు విద్యార్థిని మెహరున్నీసాను అభినందిస్తున్న డీవైఈవో శేఖర్ సింగ్

తలగడదీవి విద్యార్థుల ప్రతిభ

నాగాయలంక: తలగడదీవి జడ్పీ పాఠశాల విద్యార్థులు భోగాది గాయత్రి శ్రీ సహస్ర 581 మార్కులు, మండలి పవిత్ర 574 మార్కులు, పులిగడ్డ లేఖ్య 571 మార్కులు సాధించి సాధించి మండలంలో వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు.


గాయత్రి శ్రీసహస్ర (581)

పెదకళ్లేపల్లి సంస్కృతోన్నత, వెంకటాపురం పాఠశాలల్లో నూరుశాతం

మోపిదేవి: వెంకటాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పెదకళ్లేపల్లి సంస్కృతోన్నత పాఠశాలలు నూరు శాతం ఫలితాలు సాధించాయి. మోపిదేవి హైస్కూల్ విద్యార్థి దాసి బ్యూలా (581) మార్కులతో మండలంలో ప్రథమ, పామర్తి నాగ శివజ్యోతి 578 మార్కులతో ద్వితీయ, కంచర్ల చేతన 572 మార్కులతో తృతీయ స్థానం సాధించారు.


బ్యూలా (581)

ఘంటసాల విద్యార్థులకు మండలం ఫస్ట్, సెకండ్

ఘంటసాల: ఘంటసాల హైస్కూల్ విద్యార్థులు డి.జయసింధున 573 మార్కులు, కె.చరణ్ తేజ 567 మార్కులు సాధించి మండలంలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. శ్రీకాకుళం హైస్కూల్ విద్యార్థిని కె.సౌమ్యశ్రీ 565 మార్కులు సాధించి తృతీయ స్థానం లో నిలిచింది. ఘంటసాల హైస్కూల్‌లో 74 మందికి 63, కొడాలి హైస్కూల్‌లో 20 మందికి 17, గోగినేనిపాలెం హైస్కూల్‌లో 26 మందికి 22, శ్రీకాకుళం హైస్కూల్‌లో 41 మందికి 29, లంకపల్లిలో 16 మందికి 12, మల్లాయిచిట్టూర్పులో 12 మందికి 9, మల్లంపల్లి హైస్కూల్‌లో ఐదుగురికి నలుగురు ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 196 మంది పరీక్షలకు హాజరు కాగా 156 మంది ఉత్తీర్ణత సాధించారు.


జయ సింధున (573)

గురుకుల విద్యార్థుల ప్రభంజనం

అవనిగడ్డ రూరల్: పులిగడ్డ గురుకుల పాఠశాల విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో ప్రభంజనం సృష్టించారు. 73 మందికి 73 మంది ఉత్తీర్ణులయ్యారు. సయ్యద్ అబ్దుల్ రజాక్ 589 మార్కులు, కోలా గోపాల ఖాదర్ మహేష్ 584 మార్కులు, కలగండ్ల మనోజ్ 581 మార్కులు సాధించినట్లు ప్రధానోపాధ్యాయుడు ఎస్‌టీపీ కుమార్ తెలిపారు. పాఠశాలలో మరో నలుగురు విద్యార్థులకు 570 నుంచి 580 మార్కుల వచ్చాయని ఆయన తెలిపారు. గురుకుల పాఠశాల నుంచి 589 మార్కులతో ప్రథమ స్థానం సాధించిన ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం చెవిటికల్లు గ్రామానికి చెందిన సయ్యద్ అబ్దుల్ రజాక్ సివిల్ సర్వీసే తన లక్ష్యమని తెలిపారు.


రజాక్‌కు స్వీటు తినిపిస్తున్న తల్లి జరీనా బేగం

చల్లపల్లి మండలంలో 80శాతం ఉత్తీర్ణత

చల్లపల్లి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 80శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఐదు జడ్పీ హైస్కూల్స్, గురుకుల పాఠశాల, ఎయిడెడ్ పాఠశాలలు కలిపి 329 మంది పరీక్షలు రాయగా 263 మంది ఉత్తీర్ణులయ్యారు. చల్లపల్లి హైస్కూల్‌కు చెందిన బత్తుల బ్యూలా పాలవల్లి 575 మార్కులతో ప్రభుత్వ పాఠశాలల విభాగంలో మండల స్థాయిలో ప్రథమస్థానంలో నిలిచింది. చల్లపల్లి జడ్పీ విద్యార్థిని జి.శశికళ 574, మాజేరు హైస్కూల్ విద్యార్థిని కూనపరెడ్డి సాయికీర్తి 574 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచారు. గురుకుల బాలికల పాఠశాల విద్యార్థిని కొల్లు సిరి 551 మార్కులు సాధించారు.


బ్యూలా పాలవల్లి (575)

కప్పలదొడ్డి విద్యార్థికి 586 మార్కులు

గూడూరు: మండలంలో 77.1 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని ఎంఈవో-2 పి. సుబ్రహ్మణ్యం తెలిపారు. కప్పలదొడ్డి హైస్కూల్ విద్యార్థి నాగశివ విగ్నేష్ 586 మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానం సాధించాడు. మల్లవోలు జడ్పీహెచ్ఎస్ ఫ్లస్‌లో ఎ.దేవీప్రియ 583 మార్కులు సాధించి ద్వితీయ స్థానం, గూడూరు హైస్కూల్ విద్యార్థి సీహెచ్ తపస్వి 579 మార్కులు సాధించి తృతీయ స్థానంలో నిలిచారు.


నాగశివవిగ్నేష్ (586)

చెన్నూరు విద్యార్థినికి మండలం ఫస్ట్

పెడన/పెడన రూరల్: చెన్నూరు జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థినులు పుప్పాల భువనేశ్వరి 589 మార్కులు, యర్రంశెట్టి జాహ్నవి 582, కొండవీటి రేవతి 579 మార్కులు సాధించి మండలంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. చెన్నూరు హైస్కూల్ 81 శాతం, పెడన భట్ల జ్ఞానకోటయ్య జడ్పీ హైస్కూల్ 59 శాతం, బల్లిపర్రు గురుకుల పాఠశాల 91 శాతం, తోటమూల జడ్పీ హైస్కూల్ 76 శాతం, చేవేంద్ర జడ్పీ హైస్కూల్ 77 శాతం, పెనుమల్లి జడ్పీ హైస్కూల్ 82 శాతం, నందిగామ జడ్పీ హైస్కూల్ 54 శాతం, నందమూరు జడ్పీ హైస్కూల్ 74 శాతం ఉత్తీర్ణత సాధించాయి.


భువనేశ్వరి (589)

చోరంపూడి, కంచడంలో నూరు శాతం ఉత్తీర్ణత

బంటుమిల్లి: మండలంలో 80.17 శాతం ఉత్తీర్ణులయ్యారు. పెందుర్రు పరిషత్ హైస్కూల్‌కు చెంది వి.సాయిలక్ష్మీదుర్గ 579 మార్కులతో మండల ప్రథమ స్థానాన్ని సాధించింది. చోరంపూడి హైస్కూల్‌కు చెంది రామ్‌తేజ 574 మార్కులతో ద్వితీయ, బంటుమిల్లి హైస్కూల్‌కు చెందిన జోషిక 573 మార్కులతో తృతీయ, కంచడం హైస్కూల్‌కు చెందిన విశ్వనాథం 572 మార్కులతో 4వ స్థానాన్ని సాధించారు. మండలంలోని చోరంపూడి, కంచడం హైస్కూల్స్ 100శాతం ఉత్తీర్ణ సాధించాయి.


సాయిలక్ష్మీ దుర్గ(579)

నీలిపూడి హైస్కూల్‌లో వంద శాతం ఉత్తీర్ణత

కృత్తివెన్ను: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 80 శాతం ఉత్తీర్ణత సాధించారు. నీలిపూడి హైస్కూల్ విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. చినపాండ్రాక హైస్కూల్‌కు చెందిన గరికముక్కు మౌనిక 567 మార్కులతో మండలంలో ప్రథమ, చినగొల్లపాలేనికి చెందిన సాన దీపిక 565 మార్కులతో ద్వితీయ, సంగమూడి స్కూల్‌కు చెందిన నున్న సునీత లక్ష్మీ 564 మార్కులతో తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరిని ఎంఈవో ఎస్కేడీవీ ప్రసాదరావు అభినందించారు.


మౌనిక (567)

మూడు స్థానాలూ స్వతంత్రపురం హైస్కూల్‌వే..

కోడూరు: మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో 74 శాతం ఉత్తీర్ణులయ్యారు. స్వతంత్రపురం హైస్కూల్ విద్యార్థి ఇమిడాబత్తిన పల్లవి 584, అప్పల భవిత 581, బత్తుల ప్రవళిక 578 మార్కులు సాధించి మొదటి మూడు స్థానాల్లో నిలిచారని ఎంఈవో రామదాసు తెలిపారు.


ఇమిడాబత్తిన పల్లవి (584)



పహల్గాం ఉగ్రదాడికి వ్యతిరేకంగా మచిలీపట్నం, అవనిగడ్డ, మోపిదేవిలో కొవ్వొత్తుల ప్రదర్శన చేస్తున్న కూటమి నాయకులు

ఉగ్రదాడి అమానుషం

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడి అమానుషమని పలువురు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఉగ్రదాడిని నిరసిస్తూ బుధవారం నగరవీధుల్లో భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రదర్శనకు డివిజన్ ప్రధాన కార్యదర్శి జి.కిషోర్‌కుమార్ నాయకత్వం వహించారు. కొవ్వొత్తుల ర్యాలీ చేశారు. నగరంలో వివిధ ప్రజా సంఘాలు, రాజకీయ నాయకులతో నిర్వహించిన ర్యాలీలో పెద్ద సంఖ్యలో నగర ప్రజలు పాల్గొన్నారు.

మోపిదేవి ప్రధాన కూడలిలో..

మోపిదేవి: కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు కొవ్వొత్తులు వెలిగించి నిరసన తెలిపారు. టీడీపీ, జనసేన మండల అధ్యక్షులు నడకుదుటి జనార్దనరావు, పూషడపు రత్నగోపాల్ పాల్గొన్నారు.

నాగాయలంక సెంటర్‌లో..

నాగాయలంక: జనసేన పార్టీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీని నిర్వహించారు. మండలి వెంకట్రామ్, మెండు లక్ష్మణరావు, బండ్రెడ్డి నాగ మల్లికార్జునరావుతోపాటు కూటమి నేతలు పాల్గొన్నారు.

అవనిగడ్డలో ర్యాలీ

అవనిగడ్డ: ఎమ్మెల్యే కార్యాలయంనుంచి వంతెన సెంటర్ వరకు కూటమి నాయకులు ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చిరువోలు బుచ్చిరాజు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తుంగల మురళీకృష్ణ, నియోజకవర్గ కో-కన్వీనర్ తుంగల వెంకటగిరి, జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మత్తి వెంకటేశ్వరరావు, జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాలరావు, టీడీపీ అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, కూటమి నేతలు అన్నపరెడ్డి వెంకటస్వామి, బచ్చు వెంకటనాథ్; యాసం చిట్టిబాబు, సింహాద్రి పవన్ పాల్గొన్నారు.

వీఎస్ఆర్ యువసేన నేతృత్వంలో

విక్కుర్తి శ్రీనివాస్ యువసేన నేతృత్వంలో ఉగ్రదాడిలో అశువులు బాసిన వారికినివాళులర్పించారు. విక్కుర్తి శ్రీనివాస్, విక్కుర్తి రామకృష్ణ, విక్కుర్తి రాంబాబు, యువసేన నేతలు పాల్గొన్నారు.

ఉగ్రదాడి దేశంపై జరిగిన కుట్ర: ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

అవనిగడ్డ: జమ్మూకశ్మీర్‌లో జరిగిన దాడి దేశంపై జరిగిన కుట్ర అని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జమ్మూకశ్మీర్ పర్యాటకంగా అభివృద్ధి జరుగుతున్న తరుణంలో జరిగిన దాడిని యావత్ దేశం ఖండిస్తుందని అన్నారు. కశ్మీర్‌లో భయానక వాతావరణం సృష్టించేందుకు చేస్తున్న కుట్రను భారతీయులంతా సమర్థవంతంగా ఎదుర్కొవాలని పిలుపునిచ్చారు. జనసేన పార్టీ ఈ దాడికి నిరసనగా మూడు రోజులపాటు సంతాప దినాలు, కొవ్వొత్తుల ప్రదర్శనలు, మానవహార కార్యక్రమాలను చేపట్టిందని బుద్ధప్రసాద్ తెలిపారు.

అవనిగడ్డ టీడీపీ కార్యాలయంలో..

ఉగ్రదాడికి వ్యతిరేకంగా నిర్వహించిన సంతాప సమావేశంలో ఉగ్రదాడిలో మృతి చెందిన వారికి ఘనంగా టీడీపీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలని టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, నేతలు మెండు లక్ష్మణరావు, ఉప్పల ప్రసాద్, కోట సాయి, లకనం నాగాంజనేయులు, నాయుడు తాతారావు, మెగావత్ గోపి, సైకం దినేష్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పుస్తకపఠనం వల్ల విజ్ఞానాన్ని సముపార్జించవచ్చని జిల్లా గ్రంథాలయ సంస్థ డిప్యూటీ లైబ్రేరియన్ నగేష్ అన్నారు. ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా భారతీయ సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని పాఠకులు సద్వినియోగం చేసుకోవాలని నగేష్ సూచించారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పాఠకులు కోరిన పుస్తకాలను అందిస్తున్నామన్నారు. ఈనెల 28 నుంచి ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. పోటీ పరీక్షలకు సంసిద్ధమవుతున్న అభ్యర్థులు, భార తీయ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు కారుమూరి రాజేంద్రప్రసాద్, లాల్ బహదూర్ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

దుర్గానాగేశ్వరస్వామి హుండీల ఆదాయం రూ5.30 లక్షలు

మోపిదేవి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పెదకళ్లేపల్లిలోని దుర్గానాగేశ్వర స్వామి ఆలయంలోని హుండీల్లో భక్తులు కానుకలుగా రూ.5,30,372, రెండు గ్రాముల బంగారం సమర్పించారని ఆలయ ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు. బుధవారం ఉదయం ఆలయ ప్రాంగణంలో దేవదాయశాఖ అధికారుల పర్యవేక్షణలో హుండీలను తెరిచి లెక్కించారు. దేవాదాయశాఖ మచిలీపట్నం డివిజన్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సేవకులు హుండీల లెక్కింపులో పాల్గొన్నారు.

పీహెచ్‌సీ నిర్మాణానికి స్థల పరిశీలన


స్థల పరిశీలన చేస్తున్న టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్

గూడూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కంకటావలో నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించేందుకు బుధవారం టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్, గ్రామ ప్రముఖులు స్థల పరిశీలన జరిపారు. గ్రామస్థులంతా గ్రామాభివృద్ధి కోసం ఐక్యంగా ఉండాలని వేదవ్యాస్ సూచించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ట, తహసీల్దార్‌తో వేదవ్యాస్ ఫోనులో మాట్లాడారు. ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్‌తో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామని గ్రామ పెద్దలకు తెలిపారు.

ప్రొటోకాల్ పాటించలేదు

మోపిదేవి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కోసూరువారిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్‌ప్రాథమిక పాఠశాల సంయుక్తంగా మంగళవారం నిర్వహించిన వార్షికోత్సవ వేడుకల్లో ప్రొటోకాల్ పాటించకుండా ఉపాధ్యాయులు తనను అవమానపర్చారని ఎంపీటీసీ సభ్యుడు సనకా వెంకట రాజేష్ బుధవారం ఇన్‌చార్జి ఎంపీడీవో పాండురంగారావు, డిప్యూటీ తహసీల్దార్ వాణి, ఎంఈవో దుర్గా సాగర్‌కు వేర్వేరుగా ఫిర్యాదు చేశారు. వార్షికోత్సవంలో ప్రజాప్రతినిధులు, అతిథులను ఆహ్వానించే క్రమంలో పాఠశాలకు సంబంధం లేని వ్యక్తులను వేదికపైకి ఆహ్వానించి ఎంపీటీసీ సభ్యుడిని వేదికపైకి ఆహ్వానించకుండా అవమానించిన ఉపాధ్యాయులపై తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.


డిప్యూటీ తహసీల్దార్ ఎం.వాణికి ఫిర్యాదు చేస్తున్న ఎంపీటీసీ సభ్యుడు రాజేష్

వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం

నాగాయలంక, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మర్రిపాలెం - నంగేగడ్డ గ్రామాల మధ్య కొలువైన శివనాగరాజస్వామి ఆలయంలో వార్షికోత్సవాలు సందర్భంగా బుధవారం సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ అర్చకుడు లంకా వెంకట చలపతిరావు బ్రహ్మత్వంలో కల్యాణం జరిపించారు. అనంతరం భారీ అన్నదానం జరిగింది. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త నిజాంపట్నం నరసింహమూర్తి పర్యవేక్షించారు.

నేడు విద్యుత్ అదాలత్

చల్లపల్లి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కన్స్యూమర్ గ్రీవెన్సెస్ రెడ్రెస్సల్ ఫోరం(సీజీఆర్ఎఫ్) విజయవాడ ఆధ్వర్యంలో గురువారం చల్లపల్లిలో విద్యుత్ అదాలత్, అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు విద్యుత్‌శాఖ ఉయ్యూరు ఈఈ డి.కృష్ణానాయక్ తెలిపారు. పెదకళ్లేపల్లి రోడ్డులోని చల్లపల్లి వర్తక సంఘం ఫంక్షన్ హాలులో ఉదయం పదిన్నర గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు అదాలత్ నిర్వహించనున్నట్లు తెలిపారు. సీజీఆర్ఎఫ్ చైర్మన్ జస్టిస్ ఎన్.విక్టర్ ఇమ్మానియేల్, ఫోరం సభ్యులు, విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు పాల్గొంటారని, చల్లపల్లి డివిజన్‌లోని విద్యుత్ వినియోగదారులు తమ ఫిర్యాదులను రాతపూర్వకంగా సర్వీసు నెంబరు, పూర్తి అడ్రస్, సెల్ నెంబరుతో ఇచ్చి సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. విద్యుత్ అంతరాయాలు, హెచ్చుతగ్గులు, మీటరు సమస్యలు, బిల్లుల సమస్యలు విద్యుత్ సరఫరాకు సంబంధించిన ఇతర సమస్యలను పరిష్కరిస్తారని ఈఈ కృష్ణానాయక్ తెలిపారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్‌బర్డ్	120, 129, 140
చికెన్ విత్ స్కిన్	226
చికెన్ స్కిన్‌లెస్	236

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 420

గుడివాడలో సత్యా షోరూం ప్రారంభం

గుడివాడ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రానిక్ వస్తువుల విక్రయరంగంలో ప్రసిద్ధి చెందిన 'సత్యా' ఏజెన్సీస్ సంస్థ తన 53వ షోరూంను గుడివాడ బస్టాండ్‌రోడ్‌లో ఏర్పాటు చేసింది. బుధవారం భవన యజమాని శివరామకృష్ణ కుటుంబీకులు, సత్యా సేల్స్ ఏపీ హెడ్ సెంథిల్, సంస్థ సిబ్బంది ఈ షోరూం ప్రారంబోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంస్థ డీజీఎం సురేష్ మాట్లాడుతూ.. అన్ని గృహోపకరణాలపై 70 శాతం వరకు తగ్గింపు, ప్రతి కొనుగోలుపై ఉచిత బహుమతి అందిస్తున్నట్టు తెలిపారు. వేసవి సందర్భంగా ఏసీ కొనుగోళ్లపై ప్రత్యేక తగ్గింపు ఇస్తున్నట్టు పేర్కొన్నారు.



సత్యా షోరూంను ప్రారంభిస్తున్న శివరామకృష్ణ కుటుంబీకులు

సత్తా చాటిన సర్కార్ విద్యార్థులు

● పదోతరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రతిభ ● విద్యార్థులను అభినందించిన అధికారులు, ఉపాధ్యాయులు

గుడివాడ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఆరు మున్సిపల్ ఉన్నతపాఠశాలల నుంచి 412మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలకు హాజరుకాగా వారిలో 292మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. గుడివాడ పట్టణంలోని మున్సిపల్ పాఠశాలలో 70.87శాతం ఉత్తీర్ణత సాధించారు. 573/600లతో స్థానిక బేతవోలు మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థి కె.పవన్‌కళ్యాణ్, ఏకేటీపీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థి టి.తేజశ్రీలు ప్రథమ స్థానంలో నిలిచారు.



కె.పవన్‌కళ్యాణ్



శ్రీనాగలక్ష్మీ సంజన | ఆర్.అక్ష | ఖతీజ తహీర

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు మండలంలో పదవ తరగతి ఉత్తీర్ణత 97 శాతం వచ్చిందని ఎంఈవో -1 జగన్మోహనరావు తెలిపారు. ప్రభుత్వ హైస్కూళ్లలో 424 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 411 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. వడ్లమన్నాడు జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థిని ఎస్.శ్రీనాగలక్ష్మీ సంజన 574 మార్కులతో మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రథమ స్థానం సాధించింది. పెంజంద్ర హైస్కూల్ విద్యార్థిని ఆర్.అక్ష 572 మార్కులు సాధించి మండల ద్వితీయ స్థానం సాధించింది. అంగలూరు బాలికోన్నత పాఠశాల విద్యార్థిని అబ్దుల్ ఖతీజ తహీర 571 మార్కులతో తృతీయ స్థానం సాధించిందని జగన్మోహనరావు తెలిపారు.

గుడివాడ రూరల్ : మోటూరు డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 99 శాతం బాలికలు ఉత్తీర్ణత సాధించగా, వై.కావ్య (554) మార్కులు సాధించి మొదటి స్థానంలో నిలిచింది. గంగాధరపురం ఉన్నత పాఠశాల్లో ఏ.లక్ష్మీ ప్రసన్న 554 మార్కులతో ప్రథమస్థానంలో నిలిచింది. ఉత్తీర్ణులైన వారిని ఎంఈవోలు జగన్నాథరావు, బాలాజీలు అభినందించారు.



లక్ష్మీ ప్రసన్న | వై.కావ్య

కూచిపూడి : పదో తరగతి పరీక్షల్లో కాజ జెడ్పీ పాఠశాల విద్యార్థి రాజులపాటి చైత్ర శివనాగ సాయిశ్రీ 575 మార్కులతో మండలంలో ప్రథమ స్థానంలో నిలిచారు. నిడుమోలు జెడ్పీ పాఠశాల విద్యార్థిని తోట జ్ఞాన శ్రీవల్లి 574 మార్కులతో ద్వితీయ స్థానం సాధించింది. మొవ్వ జెడ్పీ పాఠశాల విద్యార్థి లక్ష్మీ శ్రీనివాస్ 560 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచారు.



చైత్ర శివ నాగ సాయిశ్రీ | జ్ఞాన శ్రీవల్లి | లక్ష్మీ శ్రీనివాస్



సూర పల్లవి | వెంకట పవన్ మణి | కొరపాటి స్ఫూర్తి

నందివాడ : పదో తరగతి పరీక్షా ఫలితాల్లో రుద్రపాక పిన్నమనేని వీరయ్య చౌదరి స్మారక జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థిని ప్రథమ స్థానం సూర పల్లవి 574 మార్కులు సాధించింది. రెండో స్థానంలో కణిత వెంకట పవన్ మణి 561 మార్కులతో నిలిచాడు. తృతీయ స్థానంలో కొరపాటి స్ఫూర్తి 557 మార్కులు సాధించాడు.



కోరివి ఊర్వ్శ | కె.హర్షిణి | కె.సుష్మమైత్రీ

పామర్రు : పదోతరగతి వార్షిక పరీక్ష ఫలితాల్లో జమీగొల్వేపల్లి జెడ్పీ పాఠశాల విద్యార్థిని కోరివి ఊర్వ 578 మార్కులతో ఉత్తీర్ణత సాధించి మండలంలో ప్రథమ స్థానంలో నిలిచింది. రెండోస్థానంలో పామర్రు కేఆర్ఆర్ జెడ్పీ పాఠశాల విద్యార్థి కోలపల్లి హర్షిణి 562 మార్కులు సాధించారన్నారు. జమీదగ్గుమిల్లి ప్రభుత్వ జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థిని కె. సుష్మమైత్రీ 558 మార్కులతో తృతీయ స్థానంలోనిలిచిందన్నారు. మెరుగైన ఫలితాలు పొందిన విద్యార్థులను పద్మవాణి అభినందించారు. ఇదేవిధంగా నిమ్మకూరు ఏపీఆర్ ఈఐఎస్ దిడ్లయశస్వీని గాయత్రీ 577మార్కులు సాధించి ఆపాఠశాల విభాగంలో ప్రథమస్థానంలో నిలిచిందన్నారు. ద్వితీయ స్థానంలో బి.నవ్య 567 మార్కులు సాధించగా తృతీయ స్థానంలో ఎం.రోహిత్ 546 మార్కులను రెసిడెన్షిల్ స్కూల్స్ విభాగంలో సాధించినట్టు ఎంఈవో చెప్పారు.



జి.మానస | కె.నవ్య | ఎం.స్నేహ

పెదపారుపూడి : స్థానిక వెంట్రప్రగడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన జి.మానస 569 మార్కులు సాధించి మండలం ఫస్ట్ వచ్చింది. వెంట్రప్రగడ పాఠశాల నుంచి కె.నవ్య 566 మార్కులతో ద్వితీయ స్థానం సాధించగా, యలమర్రు జెడ్పీ పాఠశాలకు చెందిన ఎం.స్నేహ 558 తృతీయ స్థానం సాధించింది. దోసపాడు జిల్లా పరిషత్ పాఠశాల 100శాతం ఉత్తీర్ణత సాధించింది. యలమర్రు 40 మందికి 37మంది ఉత్తీర్ణత సాధించారు. వెంట్రప్రగడ 52 మందికి 45మంది, వానపాముల 30 మందికి 29 మంది, పెదపారుపూడి 35 మందికి 34మంది ఉత్తీర్ణత సాధించారు. 194 మందికి 182 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో-1 బొడ్డు శ్రీనివాసరావు, ఎంఈవో 2 సురేష్ తెలిపారు.



బాల భవ్యశ్రీ | వడుగు కీర్తన | హరిప్రియ

తోట్లవల్లూరు : తోట్లవల్లూరు మండలంలో టెన్త్ ఫలితాల్లో బాలికలు పైచేయిగా నిలిచారు. పెనమకూరు జెడ్పీ హైస్కూల్‌కు చెందిన సీహెచ్ భవ్యశ్రీ 547 మార్కులతో మండల టాపర్‌గా నిలిచింది. ఇక వల్లూరుపాలెం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన వడుగు కీర్తన 535 మార్కులతో ద్వితీయ స్థానం సాధించింది. నూతలపాటి హరిప్రియ 533 మార్కులతో తృతీయ స్థానం సాధించారని ఎంఈవో-2 సురేష్ తెలిపారు.

మాజీ ఎంపీ దుష్ప్రచారం మానుకోవాలి : వెనిగండ్ల



ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి) : విజయవాడ ఎంపీ కేశినేని చిన్నిపై మాజీ ఎంపీ కేశినేని నాని దుష్ప్రచారం మానుకోవాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఒక ప్రకటనలో తెలిపారు. ఎదుగుదలకు సహకరించిన పార్టీకి వెన్నుపోటు పొడిచిన ఘనత నానిదే అని విమర్శించారు. ఉనికి కోసమే చిన్నిపై పిచ్చి ప్రేలాపనలు చేస్తున్నారన్నారు. ఇప్పటికైన తీరు మార్చుకుని అభివృద్ధికి సహకరించాలని, లేదంటే ప్రజలే గుణపాఠం చెబుతారని ఎమ్మెల్యే వెనిగండ్ల హెచ్చరించారు.



మజ్జిగ పంపిణీ చేస్తున్న తహసీల్దారు లోకరాజు

బాటసారులకు మజ్జిగ పంపిణీ

గుడ్లవల్లేరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : గుడ్లవల్లేరు బస్టాండ్ వద్ద జై భీమ్ యువజన సంఘం ఆధ్వర్యంలో బుధవారం చలివేంద్రం ప్రారంభించారు. చలివేంద్రాన్ని తహశీల్దారు లోకరాజు,గుడ్లవల్లేరు ఎస్సై ఎన్.వి.వి.సత్యనారాయణలు ప్రారంభించారు. బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో జై భీమ్ యువజన సంఘం వ్యవస్థాపకుడు గోత్రు నాగబాబు,దార్ల కిషోర్, కొల్లిపర పార్థసారధి,అనసూయ, ఓరా పాపారావు,వి.ఆర్.ఓ వెంకన్న,దార్ల కిరణ్,ఎం.సుబ్బారావు,కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే కూటమి ధ్యేయం

కూచిపూడి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమమే ధ్యేయంగా అనేక పథకాలు అమల్జేస్తుందని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. మొవ్వ వేణుగోపాల ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం సహకారంతో 43లక్షల వ్యయంతో గూడపాడులో నిర్మించిన బహుళ సౌకర్య గోదాములను బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో ప్రసంగించారు. రైతులు పండించిన పంటలు నిల్వ చేసుకోవటానికి ఈ గోదాములు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. గ్రామసర్పంచ్ తాతా ఉగాది లక్ష్మీ అధ్యక్షతన నిర్వహించిన టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు రామలింగేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ దోనేపూడి శివరామయ్య, నీటి సంఘాల అధ్యక్షులు పూర్ణచంద్రరావు, వెంకటేశ్వరరావు, వీరంకి తులసీదాస్, శీలం బాబురావు, మండవ కోటేశ్వరరావు, జిల్లా కో-ఆపరేటివ్ అధికారి కె.చంద్రశేఖర్ రెడ్డి, డివిజనల్ కో-ఆపరేటివ్ అధికారి పి.రాము, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.శేషగిరిరావు, రాష్ట్ర కో-ఆపరేటివ్ యూనియన్ నాయకులు ఆర్.రంగరాజు, కేడీసీసీ బ్యాంక్ మేనేజర్ ఎన్.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కుమార్ రాజా

లబ్ధిదారులకు సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు

పామర్రు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య బాధలతో చేతిలో చిల్లిగవ్వలేక ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న పేదకుంటుబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా అందిస్తున్న ఆర్థిక చేయూతను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. ఎమ్మెల్యే కార్యాలయంలో బుధవారం వివిధ గ్రామాలకు చెందిన 18మంది పేదకుటుంబాలకు వైద్య చికిత్సల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధినుంచి మంజూరైన రూ.19.34లక్షల విలువగల 547 చెక్కులను బాధితులకు అందజేశారు. జనసేన ఇన్‌చార్జి నరేష్, పాల్గొన్నారు.



చెక్కులను అందిస్తున్న ఎమ్మెల్యే కుమార్‌రాజా



ఎల్‌వోసీని అందజేస్తున్న టీడీపీ నాయకులు

గుడివాడ, : స్థానిక ప్రజావేదికలో అనారోగ్యంతో బాధపడుతున్న ఎన్.పవన్‌కుమార్‌కు చికిత్స నిమిత్తం రూ.2లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్‌వోసీలను అందజేశారు. టీడీపీ నేతలు జగన్మోహనరావు, శివాజీ, వీరభద్రరావు, రాంబాబు పాల్గొన్నారు.

మోడల్ ప్రాథమిక పాఠశాలగా గుర్తింపు

నందివాడ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెడుతున్న 1 నుంచి 5వ తరగతి వరకు మోడల్ ప్రాథమిక పాఠశాలగా పోలుకొండ ప్రాథమిక పాఠశాల ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జి.శ్రీలక్ష్మీ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం విద్యార్థులతో కలసి ఆమె ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు ఇంగ్లీష్ లోనే పాఠాలు చెప్పటం జరుగుతుందన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా మా పాఠశాలలో పాఠాలు చెప్పటం జరుగుతుందన్నారు. ప్రతీ ఒక్క తల్లిదండ్రులు 1వ తరగతిలో చేర్పించేందుకు అడ్మిషన్లు జరుగుతున్నాయన్నారు. మా పాఠశాలలో విద్యార్థులకు మూడు జతల బట్టలు, బ్యాగ్, ఒక జత బూట్లు, రెండు జతల సాక్సులు, ఒక బెల్టు, ఉచిత పాఠ్య పుస్తకాలు, వర్క్ బుక్ ఇవ్వటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, రజని తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



మనోహర్‌ను అభినందిస్తున్న మున్సిపల్ సిబ్బంది

మున్సిపల్ కమిషనర్‌గా మనోహర్ బాధ్యతల స్వీకరణ

గుడివాడ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : గుడివాడ మున్సిపల్ కమిషనర్‌గా సింహాద్రి మనోహర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని ఆయన ఛాంబర్‌లో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వి.శ్రీనివాసరావు, అకౌంట్స్ అధికారి జి.టి నాయుడు, అధికారులు, సిబ్బంది అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా, ప్రభుత్వ సేవలను ప్రజలను అందించడానికి కృషి చేస్తానని నూతన కమిషనర్ మనోహర్ పేర్కొన్నారు. మున్సిపల్ ప్రత్యేక అధికారి, ఆర్డీవో జి.బాలసుబ్రహ్మణ్యంను మర్యాద పూర్వకంగా కమిషనర్ కలిసారు.

ఘనంగా అంతర్జాతీయ పుస్తక దినోత్సవం



బహుమతులను అందజేస్తున్న కళాశాల పాలకవర్గ సభ్యులు

గుడివాడ, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి) : స్థానిక అక్కినేని నాగేశ్వరరావు కళాశాలలో బుధవారం అంతర్జాతీయ పుస్తక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జె.ఎస్ కుమార్ మాట్లాడుతూ పుస్తక పఠనం ద్వారా తెలివైన సమాజాన్ని నిర్మించవచ్చన్నారు. గ్రంథాలయాల సందర్శన, పుస్తకాలపై చర్చలు జరపడం ద్వారా వివిధ అంశాలపై జ్ఞానం, అవగాహన పెరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఏఎన్ఆర్ రీడర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రతి రోజూ విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహించి గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల పాలకవర్గ అధ్యక్ష,కార్యదర్శులు ఎల్ఆర్‌కే ప్రసాద్, కె.ఎస్ అప్పారావులుకళాశాల వైస్ ప్రిన్సిపాల్ బి.ఎస్.ఎస్ పద్మజ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వృద్ధులకు భోజన వసతి

గుడివాడ, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి) : స్థానిక మందపాడులోని నిరాశ్రయుల కేంద్రంలో బుధవారం కొమరవోలు వీరయ్య జ్ఞాపకార్థం ఆయన కుమార్తె, అల్లుడు రావులపాటి సాంబశివరావు, లక్ష్మీదేవిలు వితరణతో వృద్ధులకు భోజన వసతి కల్పించారు. ఈ కార్యక్రమంలో వీరయ్య కుటుంబసభ్యులు, నిరాశ్రయుల కేంద్రం మేనేజర్ లంకపల్లి పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

ఉగ్ర దాడులకు నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న జనసేన నేతలు

గుడివాడ, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి) : జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రవాదులు 28మందిని అతి దారుణంగా కాల్చి చంపడం దారుణమని జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ అన్నారు. బుధవారం స్థానిక జనసేన నియోజకవర్గ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఉగ్రవాదుల దాడులను ప్రతి ఒక్కరూ వ్యతిరేకిస్తున్నారన్నారు. మొన్న పుల్వామా, నేడు పహల్గాంలో ఉగ్రవాదులు రెచ్చిపోయి సైనికులను అమాయకులైన ప్రజలను అతి దారుణంగా హత్య చేశారన్నారు. ఉగ్రదాడిని జనసేన తీవ్రంగా ఖండిస్తోందన్నారు. రాత్రి స్థానిక పార్టీ కార్యాలయం నుంచి నెహ్రూచౌక్ సెంటర్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. నాయకులు మజ్జి శ్రీనివాసరావు, త్రినాద్, సాయన రాజేష్, గుండు వెంకట్రావు, నాగుర్ భాషా, షరీఫ్, ఇమ్మిడిశెట్టి భాను, జనపాల కిరణ్, కోసూరి ఆంజనేయులు, వీరమహిళలు సైమ్య, దుర్గ, శీరిష తదితరులు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు : పహల్గాం ఉగ్రదాడిలో ప్రాణాలు వదిలిన అమరులకు శ్రద్ధాంజలి గటిస్తూ బుధవారం రాత్రి గుడ్లవల్లేరులో క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. తొలుత బీజేపీ జిల్లాపార్టీ ఉపాధ్యక్షుడు అట్లూరి దిలీప్ కుమార్ ఆధ్వర్యంలో గుడ్లవల్లేరు లోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద కొవత్తులు వెలిగించి ఉగ్రదాడిలో అసువులు బాసిన వారికి నివాళులర్పించారు. అనంతరం జనసేన పిలుపు మేరకు కూటమి నాయకులు, కార్యకర్తలు అక్కడి నుండి క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ప్రధాన కూడలిలోని అంబేడ్కర్ విగ్రహం వద్దకు చేరి ఉగ్రవాదం నసించాలి అంటూ నినాదాలు చేసి బాదిత కుటుంబాలకు సంఘీభావంగా క్యాండిల్,సెల్ టార్చ్‌ల ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో మండల జనసేన పార్టీ అధ్యక్షులు తోట చిన్నారి, చిలంకుర్తి వెంకటేష్, నల్లమోతు సతీష్, చందన వెంకట్రాజు, అడపా బాబి, ఏఎంసీ చైర్మన్ పొట్లూరి రవికుమార్, పోలవరపు వెంకటరావు, మురాల నరేష్, అడుసుమిల్లి సుబ్బయ్య, గద్దె సోమరాజు, వెంకటేశ్వరరావు, రంగబాబు, పరందామయ్య , నాగేశ్వరరావు, ప్రసాద్ పాల్గొన్నారు.



గుడ్లవల్లేరులో ..